



బుధవారం ఉదయం బస్టాప్ వద్ద నలుగురు వృద్ధులు - మిగిలిన ముగ్గురిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్యులు - చనిపోయిన వృద్ధుడికి సామాజిక కార్యకర్త సుజాత నివాళి

ఆ ముగ్గురూ ఆస్పత్రికి

చికిత్స అందిస్తున్న వైద్యులు ● మరో వృద్ధుడి మృతి

'అవును.. వీళ్లు బతికే ఉన్నారు' అంటూ ప్రాణమున్న శవాల్లా పడున్న వారి గురించి 'ఆంధ్రజ్యోతి' మానవీయ కోణంలో స్పందించింది. మొన్న ఆరుగురు.. మంగళవారానికి ఐదుగురయ్యారు. మంగళవారం వృద్ధుడి మృతితో నలుగురు మిగిలారు. ఎవరికీ పట్టని ఆ నలుగురి దైన్యస్థితి, వారికి అమ్మలా సేవలు అందిస్తున్న సామాజిక కార్యకర్త సుజాత గురించి ప్రస్తావించింది. దీనికి కలెక్టర్ వెంకటేశ్వర్ నుంచి మానవీయ కోణంలో స్పందన లభించింది. తిరుపతి రుయాస్పత్రి సమీపంలోని ఇస్కాన్‌కు వెళ్లే రోడ్డు పక్కన బస్టాప్‌లో పడున్న ఆ నలుగురికీ మెరుగైన చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌ను బుధవారం కలెక్టర్ ఆదేశించారు. వైద్య సిబ్బంది అక్కడకు చేరుకునే సరికే మరో వృద్ధుడు మరణించాడు. మిగిలిన ముగ్గురిని రుయాస్పత్రికి తరలించి అవసరమైన వైద్యం అందిస్తున్నారు. వైద్య సిబ్బంది కంటే ముందే అక్కడకు చేరుకున్న సామాజిక కార్యకర్త సుజాత మృతి చెందిన మరో వృద్ధుడికి కూడా సొంత ఖర్చులతో దహన సంస్కారాలు నిర్వహించారు. చికిత్స పొందుతున్న ముగ్గురికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు శ్రీజనతా సేవా మిత్ర హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చారు. వారికోసం ముగ్గురు అటెండర్లను రుయాస్పత్రిలో ఉంచారు. అవసరమైన మందులను అందిస్తామని తెలిపారు. ఆ ముగ్గురి ఆరోగ్యం మెరుగై.. వారు కోలుకోవాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



వృద్ధులను తీసుకెళ్లడంతో ఖాళీగా ఉన్న బస్టాప్



అరాచకుల పీచమణచ..
బిగిసెను శాంతిదూత పిడికిలి

ఘోరాలను కళ్లజూసి..
ఎరుపెక్కెను చల్లనయ్య

మంచికాలం వచ్చునని..
మురిసెను మువ్వన్నెల జెండా

చిత్తూరు గాంధీ సెంటర్‌లో
బుధవారం రాత్రి
కనిపించిన దృశ్యం.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, చిత్తూరు

బోధనకు పదును

నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

భావిభారత పౌరులైన విద్యార్థులను అభివృద్ధి మార్గంలో నడిపించాల్సిన గురుతర బాధ్యత గురువులదే. అందుకు ముందుగా ఉపాధ్యాయులు అన్నివిధాలైన పరిజ్ఞానాన్ని, మెలకువలు అవసరం. ఈ దిశగా నూతన ఉపాధ్యాయులను తీర్చిదిద్దేందుకుగాను వృత్తిపరమైన శిక్షణ ఇస్తున్నారు. తద్వారా బోధనకు పదును పెడుతున్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను నిజమైన ఉపాధ్యాయులుగా పూర్తిస్థాయిలో తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం వృత్తి శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించింది. బోధన, అభ్యసన అంశాల్లో శిక్షణ ఇప్పిస్తోంది. విజయవాడ నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్లు 10 రోజులపాటు (ఈనెల 10వ తేదీ వరకు) శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నూతన ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడిని జయించేందుకు ఉదయం 6-7 గంటల వరకు యోగా, ఆసనాలపై శిక్షణ ఇస్తున్నారు. 7-8 గంటలమధ్య వ్యక్తిత్వ వికాసంకు సంబంధించిన అంశాలను బోధిస్తున్నారు. విద్యార్థి సమగ్ర మూర్తిమత్వం, విద్యార్థుల్లో నైతికత పెంపొందించడం, స్థిరమైన జీవితాన్ని ప్రోత్సహించడం, సమాజంపై అవగాహన కల్పిండం తోపాటు విద్యార్థి శారీరక అభివృద్ధి, మేధోభివృద్ధి, భాషాభివృద్ధి, సామాజిక సాంస్కృతిక కళాభివృద్ధిని పెంపొందించడానికి అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర విద్యాశాఖ ఎస్‌ఈఆర్టీ రూపొందించిన బోధనా విధానాలకు సంబంధించిన పుస్తకాలను, ఎఫ్ఎల్ఎన్ విధనాలు, టీఏఆర్ఎల్ విధానాలకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఉంటోంది. బోధనా అభ్యసన సామగ్రిని తయారు చేయించడం, వాటి ఆధారంగా సులభ బోధన ఎలా చేయాలనే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయులుగా పాఠశాలల్లో నిర్వహించాల్సిన రిజిస్టర్లు, రికార్డులు, పాఠ్య బోధన, తరగతి నిర్వహణ, తల్లిదండ్రుల సమావేశాలు, మధ్యాహ్న భోజన పథకాల నిర్వహణ, పాఠశాల పరిశుభ్రత, పాఠశాలల్లో నిర్వహించాల్సిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన విషయాలతో సమగ్రంగా ఈ వృత్తిపరమైన శిక్షణ సాగుతోంది. ఈ శిక్షణా కార్యక్రమంతో నూతన ఉపాధ్యాయులు సరికొత్తగా ప్రభావవంతమైన ఉపాధ్యాయులుగా అవతరించనున్నారు. అనంతరం వీరికి మళ్లీ వేసవి సెలవుల్లో రెండో దఫా శిక్షణ ఇవ్వనున్నారు.



ఆరు కేంద్రాల్లో శిక్షణ

● తిరుపతి రూరల్ దుర్గసముద్రం మెడ్జ్‌స్కూల్‌లో 450 మంది ఎస్జీటీలకు శిక్షణ సాగుతోంది. వేదాంతపురం ఢిల్లిపబ్లిక్ స్కల్‌లో 213 మంది ఫిజికల్‌సైన్స్, మైనర్ మీడియంలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నారు. తిరుపతి జీవకోనలోని విశ్వం పాఠశాలలో 250 ఎస్జీటీలకు, గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో 222 మంది ఎస్జీటీలకు మొత్తం 1135 మంది నూతన ఉపాధ్యాయులకు తిరుపతి జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో శిక్షణ తరగతులు సాగుతున్నాయి. అలాగే చిత్తూరులో శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో భాషా శాస్త్రాలకు చెందిన 152 మంది స్కూల్ అసిస్టెంట్లకు.. ఆర్కే ఇంటర్నేషనల్ స్కూల్లో గణితం, బయాలజీ, సోషల్, ఫిజికల్‌సైన్స్‌కు చెందిన 160 మంది స్కూల్ అసిస్టెంట్ల శిక్షణ ఇస్తున్నారు. వీరికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. అవసరమైన మెటీరియల్, అభ్యసన సామగ్రి అందించామన్నారు.

7 ఆర్అండ్‌బీ రోడ్లకు

రూ.24.30 కోట్లు

తిరుపతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని ఏడు ప్రధాన రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.24.30 కోట్లు మంజూరు చేసింది. స్టేట్ హైవేస్‌కు సంబంధించి గూడూరు డివిజన్‌లో గూడూరు-తురిమెర్ల రోడ్డును పది కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయడానికి రూ. 5 కోట్లు, తిరుపతి డివిజన్‌లో శ్రీకాళహస్తి - మిద్దికండ్రిగ రోడ్డును 14.65 కిలీమీటర్ల మేర మెరుగుపరిచేందుకు రూ. 4 కోట్లు చొప్పున 19.65 కిలోమీటర్ల మేర రెండు రోడ్ల అభివృద్ధి పనులకు రూ. 9 కోట్లు మంజూరైంది. అలాగే మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లకు సంబంధించి గూడూరు డివిజన్‌లో ఎంసీ రోడ్డు నుంచీ పూలతోట మీదుగా కట్టువపల్లి వరకు, పెనుబాక నుంచీ చెంబేడు రోడ్డు మీదుగా సిరసనంబేడు వరకు, సిరసనంబేడు రాజుపాలెం నుంచీ మోదుగులపాలెం వరకూ 12 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ. 3.50 కోట్లు, తిరుపతి డివిజన్‌లో బైరాజు కండ్రిగ నుంచీ రామాపురం వరకూ 4.10 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ. 2.30 కోట్లు, శ్రీకాళహస్తి నుంచీ ముసలిపేడు వరకూ 5.90 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ. 3 కోట్లు, భాకరాపేట నుంచీ మంగళంపేట వరకు, పీబీసీ రోడ్డు నుంచీ రంగన్నగారి గడ్డ మీదుగా పెద్దమల్లెల-ఎర్రావారిపాలెం రోడ్డు వరకు 14.20 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి రూ. 3.50 కోట్లు, వడమాలపేట నుంచీ తిరుమండ్యం మీదుగా ఎన్ఎన్‌పీ రోడ్డు వరకు, పాదిరేడు నుంచీ లక్ష్మమ్మ కండ్రిగ మీదుగా టీసీ అగ్రహారం వరకూ ఏడు కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి రూ. 3 కోట్లు చొప్పున మొత్తం 43.2 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి పరిచేందుకు 15.30 కోట్లు మంజూరైంది. రెండు కేటగిరీలూ కలిపి ఏడు పనుల కింద 62.85 కిలోమీటర్ల మేరకు రోడ్లను అభివృద్ధి చేయడానికి రూ. 24.30 కోట్లు మంజూరైంది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

'రెవెన్యూ మాయాజాలం'పై కలెక్టర్ సీరియస్

సత్యవేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు రెవెన్యూలో చోటు చేసుకున్న భూ మాయాజాలంపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించారు. 'వానెల్లూరు పంచాయతీ సర్వే నెంబర్ 197-1లోని అటవీ భూములకు పట్టాలు సృష్టించిన ఘటనపై వారం కిందటే క్షేత్రస్థాయి నివేదికలు నాకు అందాయి. వీటి ఆధారంగా అప్పటి ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీని ఆదేశించా. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం' అని కలెక్టర్ చెప్పారు.

మాతృ మరణాలు నియంత్రించండి

● లేకుంటే చర్యలు తప్పవన్న కలెక్టర్
● సీఆర్ ఆస్పత్రికి రూ.3లక్షల జరిమానా

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృమరణాలను నివారించేందుకు వైద్యాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన ఆస్పత్రులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. మాతృ మరణాలపై బుధవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో సమీక్షించారు. చిల్లకూరు పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న మాతృమరణాలపై చర్చించారు. గూడూరు సీఆర్‌రెడ్డి ఆస్పత్రిలో మాతృమరణంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఆస్పత్రికి రూ.3లక్షలు జరిమానా విధించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఇకపై మాతృమరణాలు చోటుచేసుకుంటే ఆస్పత్రిని సీజ్ చేస్తామన్నారు.



మాతృమరణాల ఘటనల్లో వైద్యులు, సిబ్బందిపైనా చర్యలు ఉంటాయన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీఐవో శాంతకుమారి, ఇతర అధికారులు,ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పారదర్శకత, సమయానుకూల వైద్యసేవలు అందకుంటే కఠిన చర్యలు ఉంటాయని జిల్లాస్థాయి క్రమశిక్షణా కమిటీ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్‌పథకాలపై రోగులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, వివిధ ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీటీడీలో డిప్యూటీ ఈవోల బదిలీ

● శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోగా హరీంద్రనాథ్

తిరుపతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో పలువురు డిప్యూటీ ఈవోలు బదిలీ అయ్యారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్న లోకనాథం తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో హరీంద్రనాథ్ నియమితులయ్యారు. హెచ్ఆర్ డిప్యూటీ ఈవోగా భాస్కర్, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీ ఈవోగా శాంతి నియమితులయ్యారు. కొండపై ఆర్1 డిప్యూటీ ఈవోగా నియమితులైన రాజేంద్ర ఆర్2కు కూడా ఇంచార్జిగా వ్యవహరించనున్నారు. తిరుమలలో అన్నదానం డిప్యూటీ ఈవోగా సెల్వం నియమితులు కాగా తిరుపతిలో అన్నదానం డిప్యూటీ ఈవోగా వెంకటయ్య నియమితులయ్యారు.కల్యాణకట్ట డిప్యూటీ ఈవోగా నియమితులైన గోవిందరాజన్ డోనార్ సెల్‌కు ఇంచార్జిగా వ్యవహరించనున్నారు.ఈ మేరకు టీటీడీలో బుధవారం బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎస్వీయూ వీసీగా నరసింగరావు

● నానో టెక్నాలజీ శాస్త్రవేత్తకు అవకాశం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు),అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ నూతన ఉపకులపతిగా ప్రొఫెసర్ టాటా నరసింగరావు నియమితులయ్యారు. హైదరాబాదు ఐఐటీ రీసెర్చ్ అడ్వైజర్, అడ్జంక్ట్ ప్రొఫెసర్ అయిన నరసింగరావు త్వరలో కొత్త పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.మూడేళ్ళ పాటు వీసీగా కొనసాగనున్న నరసింగరావు నానో టెక్నాలజీలో గొప్ప శాస్త్రవేత్తగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందారు.1994లో కాశీలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఈయన మద్రాసు ఐఐటీలో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేశారు. టోక్యో యూనివర్సిటీలో 1996లో పోస్టు డాక్టోరల్ ఫెలోగా వ్యవహరించారు. 2001లో టోక్యో వర్సిటీలో అధ్యాపకులుగా చేరారు. హైదరాబాదులోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్ రీసెర్చ్ సెంటర్‌లో సీనియర్ సైంటిస్టుగా 2003లో చేరి ఇదే కేంద్రానికి డైరెక్టర్‌గానూ సేవలందించారు. హైదరాబాదు ఐఐటీలో అడ్జంక్ట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఎలక్ట్రో కెమిస్ట్రీ, నానో మెటీరియల్స్ రంగంలో నరసింగరావు పరిశోధనలు మంచి గుర్తింపు పొందాయి. వ్యక్తిగతంగానూ, బృందాలతోనూ పరిశోధనలు చేపట్టిన ఈయన విశేష ఆవిష్కరణలు చేశారు. కరోనా సమయంలో క్రిమి సంహారక మాస్కులను రూపొందించడంలో కృషి చేశారు. అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకునే బ్యాటరీల తయారీకి ఈయన పరిశోధనలు తోడ్పడ్డాయి.2009లో మెటీరియల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా అవార్డు, 2014లో టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ ప్రెసిడెంట్ అవార్డు, 2015లో అకాడమీషియన్ ఆఫ్ ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అవార్డు, 2016లో భారత రాష్ట్రపతి నుంచీ అవార్డు, 2017లో ఫెలో ఆఫ్ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అవార్డు, 2022లో ఎంఆర్ఎస్ఐ మెటీరియల్ సైన్స్ వార్షిక బహుమతిని స్వీకరించారు.190 పరిశోధనా వ్యాసాలు రూపొందించారు.ఈయన పరిశోధనలకు 20 జాతీయ, అంతర్జాతీయ పేటెంట్లు లభించాయి.

ముక్కంటి ఆలయంలోకి నాగశిలలు

● మహద్వారం వరకు తీసుకొచ్చిన తమిళనాడు భక్తులు
● మరోసారి వెలుగు చూసిన భద్రతా వైఫల్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోకి భక్తులు నాగశిలలను తీసుకురావడంతో కలకలం రేగింది. ఆలయ భద్రతా వ్యవస్థ వైఫల్యంపై మరోసారి చర్చ జరిగింది. బుధవారం తమిళనాడుకు చెందిన ఇద్దరు భక్తులు రాతితో చేసిన రెండు నాగశిలలను ఒకటో గేటులో భద్రతావ్యవస్థ తనిఖీలను తప్పించుకుని ఆలయంలోకి ప్రవేశించారు. అంతే కాకుండా రూ.750 మండపంలో ఈ నాగశిలలను పెట్టి 11.40గంటల ప్రాంతంలో సర్పదోష నివారణ పూజ కూడా చేశారు. ఆ తర్వాత మహద్వారం వద్ద ఆలయంలోకి ప్రవేశించే క్రమంలో హోంగార్డులు గుర్తించి నాగశిలలను స్వాధీనం చేసుకున్నారు. ఒకటో గేటు, రాహుకేతు పూజా మండపాల వద్ద భద్రతా వ్యవస్థ వైఫల్యంపై ఆలయ అధికారులు ఉలిక్కిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆలయ భద్రతా వ్యవస్థను పటిష్టం చేశారు. కానీ ఇటీవల సిబ్బందిని మళ్లీ నిర్లక్ష్యపు నీడలు ఆవహిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● వైసీపీ హయాంలో నాలుగేళ్ల క్రితం ముక్కంటి ఆలయ భద్రతా వైఫల్యం కారణంగా గుర్తుతెలియని భక్తులు శివలింగం, నంది ప్రతిమలను ఆలయంలోపల అనధికారికంగా ప్రతిష్ఠించారు. దీనిపై విచారించి శివలింగం, నంది ప్రతిమలను ఆలయంలోకి తీసుకొచ్చిన తమిళనాడు భక్తులపై అప్పట్లో కేసు నమోదు చేశారు.

● రెండేళ్ల క్రితం 8వతరగతి విద్యార్థి రాత్రి ఆలయంలో ఉండగానే.. భద్రతాధికారులు తాళం వేశారు. రాత్రంతా ఆ విద్యార్థి ఆలయంలో సంచరించడమే కాకుండా భద్రతా సిబ్బందికి చిక్కకుండా దర్జాగా మూడవ గోపురం వద్ద ప్రహరీ దిగి వెళ్లిపోయారు.



ముక్కంటి ఆలయంలో పట్టుబడ్డ నాగశిల



వర్షంతో విమానంలోనే ప్రయాణికులు

బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం. అదే సమయంలో కోలాపూర్ నుంచి స్టార్ ఎయిర్ విమానం వచ్చింది. వర్షంతో విమానాన్ని టర్మినల్ బిల్డింగ్ సమీపంలో రన్‌వేపై ఆపేశారు. 15 నిమిషాల తర్వాత వర్షం తగ్గడంతో ప్రయాణికులు విమానం నుంచి బయటకు వచ్చారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

మేలుకో మహాశయా

అలా కుర్చీలో కునుకు తీశారా అధికారి. ఆయన్ను నిద్రలేపే సాహసం చేయలేకపోయారు సిబ్బంది. ఆయన తో పనుండి వచ్చిన వారూ ఎదురుగా కుర్చీల్లో కూర్చున్నారు. సార్.. ఎప్పుడు నిద్రలేస్తారోనని నిరీక్షిస్తున్నారు. ఇదీ నిత్యం రద్దీగా ఉండే రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం నాటి చిత్రం. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రారు ఆనంద్‌రెడ్డి ఇలా కునుకుతీస్తూ కనిపించారు. ఆయన సంతకం కోసం పలువురు వేచి ఉన్నారు. ఇక్కడ రద్దీలో ఏ పని జరగాలన్నా కొంత ఆలస్యం సహజం. కానీ ఇలా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రారు వ్యవహారంతో సిబ్బందీ ఉదాసీనంగా ఉంటున్నారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి



చంద్రగిరి

కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోండి


మొగరాల జడ్పీ హైస్కూల్‌లో టెస్ట్‌పై అవగాహన కల్పిస్తున్న టీచర్లు

పాకాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో నవంబరు, డిసెంబరు నెలల్లో నిర్వహించే కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సమన్వయకర్త వెంకటసిద్ధులు కోరారు. మొగరాల జడ్పీ హైస్కూల్‌లో బుధవారం టెస్ట్‌పై అవగాహన కల్పించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని వెలికితీసి, సైన్స్‌పట్ల ఆసక్తి కల్పించి, శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రోత్సహించడానికి ఈ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆన్‌లైన్ ద్వారా ఈ టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిభ కనబరచిన వారికి ప్రశంసాపత్రాలతోపాటు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై వక్తృత్వ పోటీలు


గెలుపొందిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంపీడీవో వాసుదేవరావు

పాకాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీడీవో వాసుదేవరావు బహుమతులు అందజేశారు. జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఔషధాలు, వ్యవసాయరంగ వస్తువులు, నిత్యావసర సరుకులపై తగ్గిన ధరలను వివరించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.ఉమామహేశ్వరి అధ్యక్షతన అవగాహన కల్పించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇ.రెడ్డిరామరాజు, ఎంఈవో బాబ్జీ, ఎంపీడీవో వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి లావణ్యలత విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు మధ్య తరగతి ప్రజలకు ఊరట


విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్న నిర్వాహకులు

చంద్రగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గించడం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఊరట నిచ్చిందని జన విజ్ఞాన జాగృతి సంస్థ జిల్లా సెక్రటరీ రెడ్డెప్ప అన్నారు. బుధవారం అగరాల వద్దవున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన రెడ్డెప్ప జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు, వారి కుటుంబాలకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భక్తవత్సలం మాట్లాడుతూ డిజిటల్ లెర్నింగ్ టూల్స్, పుస్తకాలపై జీఎస్టీ లేకపోవడంతో విద్యార్థులకు ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ నాగేంద్ర, నరసింహులు, స్టూడెంట్ అడ్వైజర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

శిల్పారామంలో రేపు, ఎల్లుండి సేల్స్ ఎగ్జిబిషన్

తిరుచానూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జీఎస్టీ శాఖ ఆధ్వర్యంలో తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఈనెల 10, 11 తేదీల్లో భారీ సేల్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు జీఎస్టీ శాఖ డిప్యూటీ కమిషనర్ నవీన్‌కుమార్ తెలిపారు. ప్రముఖ కంపెనీల ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, హోమ్ అప్లయిన్సెస్, టూ వీలర్స్, ఫోర్‌వీలర్స్‌తోపాటు తగ్గించిన జీఎస్టీ ధరలతో ఇతర వస్తువుల ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. వినియోగదారులకు తక్షణ ఫైనాన్స్ సౌకర్యం లభిస్తుందన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపన లక్ష్యం


చిన్నగొట్టిగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

భాకరాపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజ స్థాపన లక్ష్యంగా కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని అన్నారు. చిన్నగొట్టిగల్లులో కోర్ సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ యువత సుఖ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తహీనత పరీక్ష చేయించుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్ సంస్థ ప్రతినిధులు తులసి, సుభాషిణి, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దుర్గసముద్రం స్కూల్‌లో మానసిక ఆరోగ్య వారోత్సవాలు


విద్యార్థులతో సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్

తిరుపతిరూరల్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో విద్యాశాఖ, సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాభివృద్ధికి పాటించాల్సిన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. జీసీడీవో పుష్ప, డైట్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ హేమలత, హెచ్‌ఎం రవీంద్రరాజు, హెల్త్ కౌన్సిలర్లు క్రాంతి, భాగ్యశ్రీ, కృష్ణతేజ, ఏడుకొండలు, పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచని షాదీమహాల్



చంద్రగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నిర్మాణం పూర్తయి నాలుగు నెలలైనా షాదీ మహాల్ ప్రారంభానికి నోచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. రెడ్డివారిపల్లె సమీపంలోని ఈద్గా మైదానంలో గత ప్రభుత్వంలో షాదీ మహాల్ నిర్మాణానికి తుడా నిధులు రూ.1.65కోట్లు మంజూరయ్యాయి. కమిటీ సహకారంతో నాలుగు నెలల క్రితం పనులు పూర్తయ్యాయి. అయితే విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రారంభానికి నోచలేదు. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా ప్రారంభించాలని మండలంలోని ముస్లింలు కోరుతున్నారు.

అక్రమ భవన నిర్మాణాలపై చర్యలు చేపట్టండి

పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీవో ఆదేశం

తిరుపతిరూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి డివిజన్‌లోని గ్రామపంచాయతీల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చేపడుతున్న భవన నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో బి.సురేష్‌నాయుడు, రూరల్ మండల డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్ పేర్కొన్నారు. పలు పంచా యతీల్లో అనుమతి పొందకుండానే నిర్మాణాలు చేపడు తున్నారని, కొన్నిచోట్ల అనుమతి తీసుకున్నా నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. దీనిపై కార్యదర్శులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని, నిబంధనల ఉత్తర్వులు అమలు చేయడంలో వైఫల్యం చెందుతున్నారనే విమర్శలు వస్తున్నాయని పేర్కొన్నారు. వారం రోజులలోపు నివేదించాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఆదా

తిరుచానూరులో భారీ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని, డీపీవో సుశీలదేవి తదితరులు

తిరుచానూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా ప్రజలకు అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుచానూరు పంచాయతీ కార్యాలయం నుంచి సూర్యనారాయణస్వామి ఆలయం వరకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరిట బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులోకి వస్తాయన్నారు. 99 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో మధ్య తరగతి ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోందన్నారు. అనంతరం పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 30 చెత్త బండ్లను పంచాయతీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు సీఆర్‌రాజన్, డీపీవో సుశీలాదేవి, టీడీపీ నేతలు ఈశ్వర‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాయి రాయల్, హరేరామ్, వాసు, మోహన్‌రెడ్డి, కత్తి సుధ, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

రైతు బజారు ప్రారంభం


రైతు బజారును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని, ఏఎంసీ చైర్‌పర్సన్ మౌనిక, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్

తిరుచానూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద రూ.50లక్షలతో నిర్మించిన రైతు బజారును ఎమ్మెల్యే పులివర్తి నాని, ఏఎంసీ చైర్‌పర్సన్ మౌనిక బుధవారం ప్రారంభించారు. మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మెరుగైన సౌకర్యాలతో తనపల్లి క్రాస్ వద్ద రైతు బజారును అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. తద్వారా రైతులకు ఆదాయంతోపాటు ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆర్సీపురం, తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల రైతులు ఈ రైతు బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి దీన్ని ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేశారే తప్పా ఒక్క రోజు కూడా కూరగాయలు విక్రయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, సింగిల్‌విండో చైర్మన్ మధుశేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మునికృష్ణారెడ్డి, టీడీపీ నేతలు ఈశ్వరరెడ్డి, సుధా యాదవ్, మునిశేఖర్, మార్కెట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. తిరుపతి రూరల్, పాకాల, రామచంద్రాపురం, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలకు చెందిన పలువురికి రూ.26,29,766 సీఎం సహాయనిధి మంజూరైంది. బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఎర్రావారిపాలెం: పేదరికం, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సీఎం సహాయ నిధి ద్వారా ఎమ్మెల్యే పులివర్తి నాని ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని ఉస్తికాయలపెంట పంచాయతీకి చెందిన రాసయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన పరిస్థితిని పార్టీ మండలాధ్యక్షుడు, కార్యదర్శి ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకొచ్చారు. రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే రాసయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథ, రాజన్న, గోపాల్ పాల్గొన్నారు.

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో పలువురికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే స్వగృహంలో చిట్టిచెర్లకు చెందిన చలపతికి రూ.3.24 లక్షలు, చట్టివారిపాళెంకు చెందిన కృష్ణమ్మకు రూ.52,809 చెక్కులను అందేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, నాయకులు మల్లికార్జునరెడ్డి, కృష్ణమూర్తి, నాగచంగమనాయుడు, సహదేవ రెడ్డి, చంద్రారెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాలను చుట్టేసిన గజరాజులు

- రాత్రంతా పరుగులు పెట్టించిన వైనం


ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం, దేవళంపేట, అయ్యావాండ్లపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, పులిచెర్ల, రెడ్డివారిపల్లె, గడ్డంవారిపల్లె పంచాయతీల్లో మంగళవారం రాత్రంతా ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. ఫారెస్ట్ సిబ్బందిని పరుగులు తీయిం చాయి. కొన్నిచోట్ల పంటలను ధ్వంసం చేశాయి. రోజూ చీకటిపడగానే చొరబడి పంటలను ధ్వంసం చేస్తుండటంతో కంటి మీద కునుకు లేకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రం సూరప్పచెరువు నుంచి బయలుదేరిన తొమ్మిది ఏనుగులు తొలుత పాళెం పంచాయతీ మీదుగా దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లె వద్దకు చేరుకున్నాయి. నాగరాజు, రాజన్న, ధర్మేంద్ర, మధుసూదన నాయుడులకు చెందిన మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. అటవీశాఖ సిబ్బంది గుర్తించి టపాకాయలు పేల్చడంతో ఇవి వీకే పల్లె, నల్లగుట్టపల్లె, అయ్యావాండ్లపల్లె మార్గంలో యర్రంవాండ్లపల్లె వద్దకు చేరుకున్నాయి. అక్కడ మామిడిచెట్లను ధ్వంసం చేసి పశుగ్రాసాన్ని తినేశాయి. అక్కడి నుంచి పిచ్చిగుండ్లపల్లె చేరుకని వరిపంటను ధ్వంసం చేశాయి. ఫారెస్ట్ సిబ్బంది మరోమారు టపాకాయలు పేల్చడంతో ఏనుగులు పులిచెర్ల- రామిరెడ్డిగారిపల్లె రోడ్డును దాటి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి ఏనుగుల గుంపు చిన్నగొట్టిగల్లు మండలంలోకి వెళ్లి మళ్లీ పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లె సమీపంలోని అడవికి చేరుకున్నాయి. బుధవారం పగలంతా మూలమడుగు వద్ద ఏనుగులు తిష్ట వేసినట్లు సమాచారం.

గర్ల్స్ టాయిలెట్‌లో హిడెన్ కెమెరా కలకలం

చిత్తూరు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు సమీపంలోని ఓ యూనివర్సిటీలో హిడెన్ కెమెరా ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.ఈ నెల ఒకటవ తేదిన ఇంజనీరింగు చదువుతున్న ఒక విద్యార్థిని టాయిలెట్‌లోకి వెళ్లింది. అక్కడ ఓ సెల్‌ఫోన్‌లోని కెమెరా ఆన్‌చేసి ఉన్న విషయాన్ని గమనించిన ఆమె తన తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. మరుసటి రోజు ఆమె తండ్రి వచ్చి కళాశాలలోనే ఇలాంటి సంఘటనలు జరుగుతుంటే యాజమాన్యం ఏం చేస్తోందని ప్రశ్నించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. ఈ పనులను పర్యవేక్షించే వ్యక్తే టాయిలెట్‌లో సెల్‌ఫోన్ పెట్టినట్లుగా విద్యార్థుల సాయంతో యాజమాన్యం తెలుసుకుని విచారించింది. ఆ వ్యక్తి వద్ద ఉన్న ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని పంపించేసింది.అయితే గతంలో అతడేమైనా రికార్డు చేసి వుంటాడా అని విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.వర్సిటీలో జరుగుతున్న సంఘటనలపై యాజమాన్య పెద్దలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మెయిల్ ద్వారా ఫిర్యాదు పంపినట్లు సమాచారం.

గుంతలమయంగా రోడ్డు

అవస్థల్లో వాహనదారులు


శ్రీనివాసమంగాపురం సమీపంలో ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత

చంద్రగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నుంచి శ్రీనివాస మంగాపురం మార్గంలో నూతన జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై లోయను తలపించేలా గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమల శ్రీవారి దర్శనానికి, పీలేరు, మదనపల్లెకు, తిరుపతిలోని పలు విద్యాసంస్థలకు ఈ మార్గంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల ఒక ద్విచక్ర వాహనదారుడు ఈ గుంతను గమనించలేక అదుపు తప్పి గాయాలపాలయ్యాడు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎంఈవో చొరవతో పాఠశాలకు..


బిహార్ పిల్లలను పాఠశాలలో చేర్పించిన సతీష్‌బాబు బృందం

ఎర్రావారిపాలెం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి); బిహార్‌కు చెందిన కొన్ని కుటుంబాల వారు ఉపాధి కోసం వచ్చి మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీ కోళ్లఫారం వద్ద ఉంటున్నారు. వారి పిల్లలు బడికి వెళ్లడం లేదు. ఈ విషయాన్ని గమనించిన మండల విద్యాశాఖ అధికారి-2 సతీష్‌బాబు, మట్లివారిపల్లె మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సురేష్ బుధవారం అక్కడికి చేరుకుని తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడిలో చేర్పించారు. వారికి ఉచితంగా బట్టలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెడ్‌మాస్టర్ కిష్టప్ప పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


వెంకటేష్ మృతదేహం

చంద్రగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట గ్రామానికి చెందిన యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎ.రంగంపేటకు చెందిన మునిరత్నం కుమారుడు వెంకటేష్(21) మంగళవారం రాత్రి పొలం వద్ద నుంచి ఫ్లెక్సీ తీసుకుని వస్తుండగా పైనున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి నారావారిపల్లె సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే దీనికి సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విజయకుమార్‌కు సన్మానం



రామచంద్రాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా నియమితులైన విజయ కుమార్‌ను టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానిం చారు. పీవీపురం పంచాయతీ వెంగమాంబపురం గ్రామానికి చెందిన విజయకుమార్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి దక్కింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దనచౌదరి, రాజేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తిరుచానూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిస్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ రఘునాథ్ రిసార్ట్స్‌లో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆరు మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

కాణిపాకం ఆలయ ట్రస్టు బోర్డు ఖరారు


ఊట్ల నాగరాజ నాయుడు - అనసూయమ్మ - పద్మలత

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆల యానికి 16మందితో ట్రస్టు బోర్డు ఖరారైంది. ఛైర్మన్‌గా మణి నాయుడు అలియాస్ సురేంద్రను కొద్దిరోజుల క్రిత మే ఖరారు చేసిన విషయం తెలిసిందే. సభ్యులుగా మన రాష్ట్రం నుంచే కాక తెలంగాణకు చెందిన ఒకరిని కూడా నియమించారు.వీరిలో టీడీపీకి చెందిన వారితో పాటు జనసేన పార్టీ నుంచి ఇద్దరికి, బీజేపీ నుంచి ఒక్కరికి స్థానం లభించింది. వీరిలో చంద్రశేఖర రెడ్డి, కాది సుధాకర రెడ్డి,కొత్తపల్లె శివప్రసాద్, ఊట్ల నాగరాజు నాయుడు, పెరుమాళ్ల సుబ్బారెడ్డి(పూతలపట్టు నియోజకవర్గం),బీవీ సురేష్, వసంత(కుప్పం), కేఎస్.అనసూయమ్మ(గంగాధరనెల్లూరు), శ్రీవాణి (పీలేరు),పద్మలత కనకరాజు(చంద్రగిరి),పరిమి చంద్రకళ(తాడిపత్రి), సంధ్యారాణి దేవరకొండ (రాజంపేట),గుంటుపల్లె సునీత (ప్రత్తిపాడు),టీవీరాజ్యలక్ష్మి(కర్నూలు), కీలపర్తి రాజేశ్వరి(మాడుగుల)తో పాటు తెలంగాణ నుంచి శ్రీపతి సతీష్ వున్నారు.

బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయి విద్యార్థి ఆత్మహత్య

పుంగనూరు రూరల్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయి ఓ విద్యార్థి ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం....పుంగనూరు పట్టణం ఎన్ఎస్‌పేటలోని మురిగిమఠంవీధికి చెందిన సుబ్రహ్మణ్యంరాజు కుమారుడు సురేంద్రరాజు(22) తమిళనాడులో బీటెక్ చదువుతున్నాడు.సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడి దాదాపు రూ.30లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు మంగళవారం మందలించారు. దీంతో సురేంద్రరాజు ఇంటి నుంచి వెళ్లిపోయి వనమలదిన్నె మార్గంలోని పొలంలో పశువుల షెడ్ వద్ద పురుగుల మందు తాగాడు. స్పృహ కోల్పోయిన ఇతడ్ని పరిసరాల్లోని రైతులు గుర్తించారు. కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు చేరుకుని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో చెన్నై సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

నగరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని మునెప్పనాయుడు కండ్రిగలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిందుప్రియ(5) అనే బాలిక మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... మునెప్పనాయుడు కండ్రిగకు చెందిన రాజేష్ కుమార్తె బిందుప్రియ వీధిలో ఆడుకుంటుండగా, వేగంగా వచ్చిన ఆటో ఢీకొనడంతో పాటు పైకి ఎక్కిదిగడంతో బాలిక తీవ్ర రక్తగాయాలపాలైంది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో బాలిక మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

తైక్వాండోలో గోల్డ్‌మెడల్

తిరుపతి(జీవకోన), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన తైక్వాండో పోటీలలో అండర్-14 కేటగిరిలో తిరుపతి గీతాంజలి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని వరుణ్య గోల్డ్‌మెడల్ సాధించినట్లు కోచ్ బాలకృష్ణ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలన్నారు. వరుణ్య మాట్లాడుతూ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మెడల్ సాధించి, జాతీయ క్రీడల్లో ప్రవేశించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బెల్లంకొండ సురేష్, గీతాంజలి పాఠశాల డైరెక్టర్ నెల్లూరు మాధవి, దాక్షాయని పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

● జర్నలిస్టు కాలనీని పరిశీలించిన కమిషనర్

తిరుపతి, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి) : ఎస్ఆర్ శంకరన్ జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారంలో భాగంగా బుధవారం ఆమె జర్నలిస్టు కాలనీలో పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, పాత్రికేయులు కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ మూర్తి, డీఈలు రమణ, శిల్ప, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి ఉన్నారు.

కమిషనర్‌కు అభినందన



తిరుపతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకున్న తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యను డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ అభినందించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆమెను కలిసి సన్మానించారు. కార్పొరేటర్లు ఎస్కే బాబు, నరసింహాచారి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శిస్తే నాలుక కోస్తాం

● పేర్ని నానికి జనసేన నేత కిరణ్ రాయల్ హెచ్చరిక



తిరుపతి(జీవకోన), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే నాలుక కోస్తామని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిని జనసేన నేత కిరణ్‌రాయల్ హెచ్చరించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో కల్తీ మద్యం తయారు చేస్తున్న వారిని ప్రభుత్వం పట్టుకుందని, బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసిందని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండ్ బ్యాచ్ లిక్కర్స్ స్కాంలో వేలకోట్లు దోచేసి, ఇప్పుడు జైలు ఊచలు లెక్కపెడుతున్నారని ఆరోపించారు. పవన్ ఎక్కడా కనబడటం లేదంటూ మాజీ మంత్రి పేర్ని నాని విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కల్తీ మద్యంతో జనాల ప్రాణాలు తీసిన వైసీపీ నేతలకు కూటమి నేతలను విమర్శించే అర్హత లేదన్నారు. ఈ సమావేశంలో జనసేన నేతలు పాల్గొన్నారు.

టపాకాయల విక్రయంపై విచారణ చేపట్టాలి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ ముసుగులో టపాకాయల విక్రయంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని తిరుపతికి చెందిన శ్రీవారి భక్తుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో రెండు టపాకాయల దుకాణాలను ఐదుగురు ఉద్యోగులు కలిసి నిర్వహిస్తున్నారని, అయితే ఉద్యోగులకు ఏ మాత్రమూ తక్కువ రేట్లకు ఇవ్వడం లేదని ఆరోపించారు. కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో టీటీడీ ముసుగులో జరుగుతున్న ఈ దోపిడీని అడ్డుకోవాలని కోరారు. జీఎస్టీ ఎవరి పేరుతో ఉంది.. ఏ ఖాతాకు డబ్బు జమ అవుతోందన్న విషయాలు తేలాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో నాగులు, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



మహేశ్వరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మేనేజ్‌మెంట్ స్టడీస్ పరిశోధకురాలు వై.మహేశ్వరి డాక్టరేట్ పొందారు. అసెస్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీస్ అండ్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ ఆఫ్ సెలెక్ట్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా అంశంపై ప్రొఫెసర్ పి.రఘునాథరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ రాజమాణిక్యం తెలిపారు. మహేశ్వరి ప్రస్తుతం ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

ఘనంగా విత్తన దినోత్సవం



విత్తన ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న సుమతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఆర్ఏఆర్ఎస్)లో బుధవారం విత్తన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్ఏఆర్ఎస్ డైరెక్టర్ సుమతి, శాస్త్రవేత్త జాన్ తదితరులు రైతులకు విత్తన ప్రాముఖ్యతను వివరించారు. మంచి రకం విత్తనాల ఎంపికతో మంచి దిగుబడి సాధ్యమవుతుందన్నారు. వివిధ రకాల విత్తనాలను ప్రదర్శించారు. శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైసీపీ ధర్నా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం విక్రయాలను వ్యతిరేకిస్తూ వైసీపీ మహిళా విభాగం నేతలు బుధవారం తిరుపతి అర్బన్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గీతా యాదవ్, నగర బూత్ కమిటీ అధ్యక్షురాలు సాయికుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కూటమి నేతలు కల్తీ మద్యం తయారు చేస్తుండటంతో సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి టౌన్ బ్యాంకు డైరెక్టర్లు అమరనాథరెడ్డి, చంద్రయ్య, కార్పొరేటర్లు పునీత, గణేష్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఏపీఈఆర్సీ చైర్మన్



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) చైర్మన్‌గా ఎంపికైన పి.వెంకటరామారెడ్డి బుధవారం కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు తిరుమలకు చేరుకున్న వారికి సదరన్ డిస్కం డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్, ఎస్ఈ వి.చంద్రశేఖరరావు, ఈఈ సి.గంగాధర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ కె.జయప్రకాష్, ఏఈ జి.వెంకటరమణ స్వాగతం పలికారు.

శంకరంబాడి విగ్రహాన్ని సరైన స్థానంలో ఏర్పాటు చేయాలి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం సర్కిల్లో ఏర్పాటు చేస్తున్న ఐలాండ్‌పై శంకరంబాడి సుందరాచారి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఫ్లైవోవర్ నిర్మాణం పూర్తయిన తర్వాత కూడలికి సమీపంలో డివైడర్ మధ్యలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, అది సరైన స్థానం కాదని తెలిపారు. భాషాభిమానులు పుష్పమాలలు వేసేందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 11 మందికి జరిమానా విధిస్తూ బుధవారం తిరుపతిలోని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున మొత్తం రూ.1.10 లక్షలు జరిమానా విధించారు.

'ఆయు' హెల్త్‌కేర్ ఏర్పాటు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ ఆధారిత హెల్త్‌కేర్ సేవలను అందించేందుకు ఆయు హెల్త్‌కేర్ ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు వంశీకృష్ణ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ప్రజలకు హెల్త్‌కేర్ సేవలను అందించాలన్న ఉద్దేశంతో ఆన్‌లైన్ వైద్య కన్సల్టేషన్ ప్లాట్‌ఫార్మ్‌లు ప్రారంభిస్తున్నా మన్నారు. 9121081080కు మిస్‌కాల్ చేస్తే జూమ్ ద్వారా సంబంధిత వైద్యులను సంప్రదించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రారంభ ధర రూ.499 నుంచి ఉంటాయని వెల్లడించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న షణ్ముగం

తిరుపతి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్‌పల్లెలోని యూత్‌హాస్టల్‌లో ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగ ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సమాచార హక్కుచట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో పోస్ట్ ద్వారా లేదా డాక్యుమెంట్ రూపంలో అందిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించారు. డ్వాక్రాసభ్యులు పాల్గొన్నారు.

ఎంబీయూపై సిట్ విచారణకు ఆదేశించాలి : ఏఐఎస్ఎఫ్



మీడియా సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నేతలు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీ ఫీజుల కుంభకోణంపై సిట్ విచారణకు ఆదేశించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి రూ.15 లక్షలు పెనాల్టీ విధించడం, రూ.26 కోట్లను విద్యార్థులకు తిరిగి చెల్లించాలని ఏపీఎఫ్ఆర్సీ ఇచ్చిన ఆదేశాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. శ్రీవిద్యానికేతన్ ఎడ్యుకేషన్ ట్రస్టులో ముఖ్య సభ్యుడైన మంచు విష్ణు హాస్టల్, మెస్ ఫీజుల రూపంలో రూ.200 కోట్లకుపైగా విద్యార్థుల నుంచి వసూలు చేసి వ్యక్తిగత సంస్థ వాలిమర్ ప్రాజెక్టుకు మళ్లించారని ఆరోపించారు. యూనివర్సిటీ గుర్తింపు రద్దుచేయకుండా ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఉన్నత విద్యావిధానంలో నవీకరణ అవసరం



వెంకటరెడ్డిని సత్కరిస్తున్న శిష్యబృందం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఉన్నత విద్యావిధానంలో నవీకరణ అవసరమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి కూతాటి వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు. తిరుపతిలో స్థిరపడిన ఆయన 95వ జన్మదినం సందర్భంగా శిష్యబృందం బుధవారం కలిసి సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. వివిధ అంశాలపై దాదాపు 25 పుస్తకాలను ఆయన ప్రచురించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ అప్పారావు పిళ్లై, స్వరాజ్యలక్ష్మి, రాజేంద్రరెడ్డి, చలపతి, శాంతి, రెడ్డెప్పరెడ్డి, సాకం నాగరాజు, విజయ, వెంకటమునిరెడ్డి, హేమాక్షి ఆచారి పాల్గొన్నారు.

ఎస్వీయూలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమీక్ష

● కాగ్ సూచించిన 24 అంశాలపై సుదీర్ఘ చర్చ



ఓఆర్ఐలో తాళపత్రాలను పరిశీలిస్తున్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమీక్షించింది. రాష్ట్రంలో తొలిసారిగా ఎస్వీయూను ఈ బృందం సందర్శించింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కూడిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పి.రామాంజనేయులు నేతృత్వంలో కాగ్ నివేదికను ఎస్వీయూ సెనేట్ హాల్లో బుధవారం సమీక్షించింది. కమిటీ సభ్యులు నక్కా ఆనందబాబు, ఎ.రాధాకృష్ణ, ఎం.అశోక్‌కుమార్‌రెడ్డి, బి. రామాంజనేయులు, బి.జయనాగేశ్వరరెడ్డి, కె.లలితకుమారి, శ్రీరామ్ రాజగోపాల్, పి.విష్ణుకుమార్‌రాజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల దాకా సమీక్ష చేశారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు యూనివర్సిటీ ప్రగతిని నివేదించారు. భారత ప్రభుత్వ కంట్రోల్ అండ్ ఆడిట్ జనరల్ విభాగం యూనివర్సిటీకి సంబంధించి చేసిన 24 అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి వీలుగా నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరిచే కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ యూనివర్సిటీకి సూచించింది. జాబ్‌మేళాలు, నూతన జాతీయ విద్యా విధానం-2020, ఉపాధి సహిత కొత్త కోర్సుల ఏర్పాటు, విద్యార్థులకు ఫీల్డ్ ప్రాజెక్టులపై దృష్టి సారించడం, నాణ్యమైన బోధనా సిబ్బంది నియామకం, యూనివర్సిటీ అనుబంధ కాలేజీల్లో మౌళిక సదుపాయాల కల్పన, పరీక్షా ఫలితాలను వేగంగా విడుదల చేయడం, అనుబంధ కాలేజీల్లోనూ ఐక్యూఏసీ, ల్యాబ్‌లు, గ్రౌండ్‌ల ఏర్పాటు, రూసా రెండో దశ నిధుల వినియోగంపై చర్చించారు. యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన వివరాలతో కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో సీడీసీ డీన్ చెంగ్రాయుడు, పరీక్షల డీన్ సురేంద్రబాబు, డెవలప్‌మెంట్ డీన్ బాలాజీ, ప్రిన్సిపాళ్లు సుధారాణి, పద్మావతి, వెంకటేశ్వర్లు, ఇంజినీర్ తాండవకృష్ణ, డీఆర్ దావ్లానాయక్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓఆర్ఐ సందర్శన

ఓఆర్ఐ విభాగాన్ని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. అక్కడ ఏర్పాటు చేసిన అరుదైన తాళపత్రాలను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడితో కలిసి వారు పరిశీలించారు. తాళపత్రాలకు సంబంధించిన విశేషాలను ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వేంకటేశ్వర్లు వివరించారు. ఓఆర్ఐలోని అరుదైన తాళపత్రాల గురించి ఆధునిక ప్రపంచానికి తెలియజేయాలని కమిటీ సూచించింది. ఒక వీడియో రూపొందించి ప్రతి పాఠశాలలోనూ వాటి గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించాలని కోరారు.

అడవులను, వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

● వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సభలో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

మంగళం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్వీ జూపార్కులో 71వ వన్యప్రాణి వారోత్సవాలు ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. జవహర్ బాలభవన్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్‌పోటీలను నిర్వహించారు. జూపార్కులోని జంతువుల గురించి షార్ట్ వీడియోను, ఫొటోలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా వచ్చిన టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణ గురించి విద్యార్థి దశనుంచే తెలుసుకోవాలన్నారు. జూ క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ అంతరించిపోతున్న జంతుజాతులను ఎలా సంరక్షించుకోవాలి.. అడవులను ఎలా అభివృద్ధి చేయాలి అనే అంశాలను వివరించారు. అనంతరం పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జూ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జూక్యూరేటర్ సెల్వం, టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్

జే శాప్ క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు జట్టు



ట్రోఫీ అందుకుంటున్న చిత్తూరు జట్టు క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జేశాప్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ విజేతగా చిత్తూరు జట్టు నిలిచింది. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఫైనల్‌కు చేరిన చిత్తూరు, తూర్పు గోదావరి జట్ల మధ్య పోటీని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ టాస్ వేసి ప్రారంభించారు. ఇందులో తూర్పుగోదావరి జట్టుపై చిత్తూరు జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్ర బాబు, ఎంఎస్ రాజు, పల్లె సింధూర రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జర్నలిస్టులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

చిరుతల సంచారం

● భయాందోళనలో ఆ రెండు గ్రామాల ప్రజలు

ఎర్రావారిపాలెం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగుంట పంచాయతీ చిన్నరామాపురం, సుబ్బరామాపురం పరిసరాల్లో చిరుతలు సంచరిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కుక్కపై దాడిచేసి, లాక్కెళ్లింది. బుధవారం ఉదయం రైతులు తమ పొలాల్లో చిరుత జాడలను గుర్తించారు. సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ సిబ్బందితో కలిసి ఆ రెండు గ్రామాల పరిసరాలు, పొలాలను పరిశీలించారు. చిరుత పాదముద్రలుగా నిర్ధారించారు. పొలాల వద్ద, రాత్రివేళల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాగా, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల సరిహద్దు గ్రామం దేవరకొండ, మల్లెలవాండ్లపల్లె పొలాల్లోనూ చిరుత పాదముద్రలను రైతులు గుర్తించారు. పొలం వద్ద ఉన్న కుక్కను నోట కరుచుకుని వెళ్లడం చూశారు. తిరుమల నడకదారిలో పట్టుబడిన చిరుతలను ఇక్కడ వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



చిన్నరామాపురం వద్ద చిరుత పాదముద్రలు

తిరుచానూరు నుంచి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు టెర్మినల్‌గా ఈనెల 9వ తేదీ నుంచి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు తిరుపతి కేంద్రంగా నడుస్తున్న పది ప్రత్యేక రైళ్లు తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి నడిచేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

● సికింద్రాబాదు నుంచి ప్రత్యేక రైలు 9న ఉదయం 10.30 గంటలకు తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. తిరిగి ఈ ప్రత్యేక రైలు(07010) తిరుచానూరులో అదేరోజు సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరుతుంది.

● నాందేడ్ నుంచి ప్రత్యేక రైలు 11 తేదీ ఉదయం 11.30 గంటలకు తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. తిరిగి ఈ ప్రత్యేక రైలు(07016) తిరుచానూరు నుంచి అదేరోజు రాత్రి 7.50 గంటలకు బయలుదేరుతుంది.

● చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలు 12 తేదీన ఉదయం 11.15 గంటలకు తిరుచానూరుకు చేరుకుంటుంది. తిరిగి ఈ ప్రత్యేక రైలు(07018) తిరుచానూరు నుంచి అదేరోజు సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరుతుంది.

● జాల్నా నుంచి ప్రత్యేక రైలు 13 తేదీన ఉదయం 10.45 గంటలకు తిరుచానూరుకు చేరుకుంటుంది. తిరిగి ఈ ప్రత్యేక రైలు(07610) తిరుచానూరు నుంచి అదేరోజు మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరుతుంది.

● చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలు 15 తేదీన ఉదయం 8.00 గంటలకు తిరుచానూరుకు చేరుకుంటుంది. తిరిగి ఈ ప్రత్యేక రైలు(07252) తిరుచానూరు నుంచి అదేరోజు సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరుతుంది.

పెరిగిన ఆధార్ సేవల రుసుము

ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితం



చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద సచివాలయంలో జరుగుతున్న ఆధార్ నమోదు కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవల రుసుమును యూఐడీఏఐ స్వల్పంగా పెంచింది. ఈ నెల 1 నుంచి 2028 సెప్టెంబరు 30వ తేదీ వరకు పెంచిన ఛార్జీలు అమల్లో ఉంటాయి. జిల్లాలో నిత్యం 8వేల నుంచి 10వేల మంది ఆధార్ సేవలు పొందుతున్నారు. ఐదేళ్లకు పైబడిన వారిలో ఆధార్ నవీకరణ చేయించుకోవాల్సిన వారు 50వేలకు పైబడి ఉన్నారు. వారందరినీ ఆధార్ కేంద్రాల బాట పట్టించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆధార్ ఛార్జీల మార్పుల్లో ఐదేళ్లలోపు పిల్లలకు నూతన ఆధార్ నమోదుతో పాటు బయోమెట్రిక్ ఉచితంగా చేయనున్నారు. ఏడేళ్ల నుంచి 17ఏళ్లకు పైబడిన వారు వేలిముద్ర నవీకరించుకునేందుకు మొన్నటి వరకు రూ.100 రుసుము ఉండగా ఇప్పుడు రూ.125కి పెంచారు. చిరునామాను మార్చుకోవడానికి చెల్లించాల్సిన రూ.50 రుసుమును రూ.75కు పెంచారు. ఆధార్‌కార్డు కలర్ ప్రింట్ ఏ-4 సైజులో ఇవ్వడానికి గతంలో రూ.20 రుసుముండగా దాన్ని రూ.40కి పెంచారు. కొనసాగుతున్న ఆధార్ శిబిరాల్లో పెరిగిన రుసుమును వసూలు చేస్తున్నారు.

పేలుడు పదార్థాల రవాణా కేసులో ఐదేళ్ల జైలు, జరిమానా

చిత్తూరు లీగల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు రవాణా చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు, జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. 2019 ఫిబ్రవరి 22వ తేదిన సాయంత్రం కుప్పం పోలీసులు కృష్ణాపురం గ్రామం వద్ద భారత్ పెట్రోల్ బంకు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా టిఎన్49 బి8370 నెంబరు గల ట్రాక్టర్ తమిళనాడు వైపు నుంచి కుప్పం వైపు వచ్చింది. తమిళనాడు రాష్ట్రం సత్రపల్లి గ్రామానికి చెందిన మురుగన్ అనే వ్యక్తి ట్రాక్టర్‌ను ఆపి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతడి నుంచి 40 డిటోనేటర్లు, 40 జెనెటిన్ స్టిక్స్, ఒక మగ్గర్ బాక్స్‌తో పాటు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు బుధవారం జిల్లా కోర్టులో వాయిదా వుండగా, పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అతడిపై నేరం రుజువు కావడంతో ఐదు సంవత్సరాలు జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసును పీపీ బి.రామకృష్ణమనాయుడు వాదించారు.

11న దివ్యాంగులకు లా కౌన్సెలింగ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీ దివ్యాంగులకు లా కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. దివ్యాంగుల కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారు ఆ రోజున గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ అడ్మిషన్స్ విభాగంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుంది. సమగ్ర సమాచారం కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారిక వెబ్‌సైట్ చూడాలని లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీతాకుమారి తెలిపారు.

విద్యార్థులకు పద్యపోటీలు


చిత్తూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జాతీయస్థాయి పద్యపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తుల సీనాథం నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీలోగా 95534 29770 నెంబరుకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



నారా రోహిత్



అమరెడ్డి, పవిత్ర



కోనా వెంకట్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో సినీహీరో నారా రోహిత్, నటులు అమరెడ్డి, పవిత్ర, మాటల రచయిత కోనా వెంకట్, సీనియర్ ఐఏఎస్ అధికారి పంకజ్ కుమార్ బన్సల్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సత్యాత్మతీర్థ స్వామిజీకి తిరుమలలో పెద్దమర్యాద



తిరుమల, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాదిమఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద స్వామిజీకి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చక బృందం ఇస్తికాఫల్(పెద్ద మర్యాద) స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపంతో ఆశీర్వాదం అందించారు. అనంతరం ఆయన తన శిష్యబృందంతో కలిసి మంగళవాయిద్యాల నడుమ ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.74 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,634

తలనీలాలు సమర్పించినవారు: 24,980



వేంకటేశ్వరస్వామి ఆలయంపై పిడుగుపాటు



దెబ్బతిన్న ఆలయ గోపుర శిఖర భాగం - పగిలి కిందపడిన దేవతామూర్తుల భాగాలు

సూళ్లూరుపేట,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు వెంకటేశ్వరస్వామి ఆలయ గోపురంపై బుధవారం సాయంత్రం పిడుగు పడింది. 4 గంటల సమయంలో భారీ వర్షంతో పాటు పెద్ద శబ్ధంతో పిడుగు పడడంతో ఆలయ గోపురంపై ఉన్న శిలలు దెబ్బతిన్నాయి. అలాగే గోపురంపై ఉన్న దేవతామూర్తుల భాగాలు పగిలి కింద పడ్డాయి. అదే సమయంలో ఆలయ వరండాలో ఉన్న కొందరు గ్రామస్తులు భయంతో పరుగులు తీశారు. కాసేపటికి తేరుకున్న గ్రామస్తులు పిడుగు పడిన ప్రదేశాన్ని పరిశీలించారు.

'తుడా టవర్స్'సేల్‌పై కమిటీ

- రెసిడెన్షియల్ ఫ్లాట్ల ధరలు సవరణకు కసరత్తు
- ఒక్కోఫ్లాట్‌పై రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తగ్గే అవకాశం
- మంత్రి గ్రీన్ సిగ్నల్

తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అన్నమయ్య సర్కిల్లో నిర్మిస్తున్న ఐకానిక్ టవర్స్‌లో రెసిడెన్షియల్ ఫ్లాట్ల ధరలు తగ్గనున్నాయి. అధిక ధరల వలన విక్రయాలు మందకొడిగా సాగుతుండడంతో కమిటీని ఏర్పాటుచేసేందుకు తుడా సిద్ధమైంది. 206 రెసిడెన్షియల్ ఫ్లాట్లలో ఇప్పటికి 21మాత్రమే అమ్ముడయ్యాయి. చదరపు అడుగు ధర ఎక్కువగా ఉండడం వల్లే కొనుగోలుదారులు ముందుకురావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణ తుడా కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఐకానిక్ టవర్స్ గురించి ఆరాతీశారు. స్థానికంగా ఉన్న అపార్ట్‌మెంట్ల ధరలను పరిశీలిస్తే, తుడా టవర్స్‌లోని రెసిడెన్షియల్ ఫ్లాట్ల చదరపు అడుగు ధర ఎక్కువగా ఉందన్న అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. దీనికోసం ఓ కమిటీని ఏర్పాటుచేసి ధరలను సవరించాలని తుడా వీసీ శుభం బన్సల్ మంత్రిని కోరారు. మంత్రి కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తూ త్వరలోనే ఆ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. ప్రస్తుతం రెసిడెన్షియల్ ధర చదరపు అడుగు రూ.5,900 గా ఉంది. దీనిని రూ.5,500లుగా సవరించే అవకాశం కనిపిస్తోంది. అంటే ఒక్కో ఫ్లాట్ ధర రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు తగ్గించే అవకాశం కనిపిస్తోంది. అదేవిధంగా కమర్షియల్ స్పేస్ చదరపు అడుగు రూ.12వేలు ఉంది. 31 వాణిజ్య సముదాయాల్లో 11 సేల్ అయిపోయాయి. దీనికి మంచి డిమాండు ఉండడంతో వీటి ధరలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు.



టవర్స్ తాజా పరిస్థితి

తుడా టవర్స్ 3.6 ఎకరాల్లో రూ.345 కోట్లతో నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం రూ.122 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 14 అంతస్తుల భవనంలో 12వ ఫ్లోర్ స్లాబ్ పూర్తయింది. 6వ ఫ్లోర్ వరకు టైల్స్ పనులు జరిగాయి. ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మాణ వ్యయం కాకుండా తుడా రూ.150కోట్లు ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే రూ.91కోట్లు విక్రయాల ద్వారా తుడా ఖాతాలోకి చేరాయి. మరో రూ.66 కోట్లు రావాల్సి ఉంది.

జూన్‌లో నిర్మాణం పూర్తి

గ్రౌండ్, ఒకటవ అంతస్థులో 27 విశాలమైన గదులతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థుల్లో ఆఫీసుల వినియోగానికి, మిగిలిన వాటిలో 206 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. కమర్షియల్, రెసిడెన్షియల్‌కు వేర్వేరుగా యాంపుల్ పార్కింగ్, లిఫ్టులు, వేర్వేరుగా మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. జూన్‌లోపు అందుబాటులోకి వస్తుందని తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ చెప్పారు.

డ్రైవర్ ఆత్మహత్య

- ఎస్‌ఐ బెదిరింపులే కారణమని తల్లి ఆరోపణ



అనిల్ (ఫైల్‌ఫొటో)

కోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన నన్నిమేల అనిల్ (36) గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ రొయ్యల పరిశ్రమకు చెందిన కార్మికులను తీసుకెళ్లే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న అనిల్ పెద్దమొత్తంలో అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు భరించలేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా ఒక బాకీదారుడికి అప్పు చెల్లించాలని ఎస్‌ఐ పవన్‌కుమార్ బెదిరించడంతోనే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నాడని అనిల్ తల్లి ఉమామహేశ్వరి గూడూరు డీఎస్పీ గీతాకుమారికి ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నామని వాకాడు సీఐ హుస్సేన్ బాషా తెలిపారు.

'మార్పు'తోనే మనుగడ

- సహకార రంగం బలోపేతమే లక్ష్యం
- తిరుపతి సదస్సులో కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆశిష్‌కుమార్ భూటాని

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'ఏ రంగమైనా మార్పుతోనే మనుగడ సాధిస్తుంది. గ్లోబలైజేషన్, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా మలచుకోలేక అనేక సహకార సంస్థలు ప్రాధాన్యం కోల్పోయాయి. పాత విధానాలు కొనసాగిస్తూ, సభ్యులను ఆకర్షించలేకపోయాయి. దీనికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలే నిదర్శనం. ఏపీలో మాత్రం పీఏసీఎస్‌లు ఇపుడు పెట్రోల్ బంకు వంటి కొత్త రంగాల్లో అడుగుపెట్టడం సంతోషకరం' అని కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని అన్నారు. 'సహకార రంగం అభివృద్ధి- డిజిటలైజేషన్, గ్రైన్ స్టోరేజ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు విస్తరణ, కోఆపరేటివ్ బ్యాంకింగ్ బలపరిచే దిశగా' అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు బుధవారం తిరుపతి తాజ్‌హోటల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాల్లో సహకార రంగాన్ని బలోపేతం చేయడం, ఆర్థిక వృద్ధిని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు చెప్పారు. సహకార బ్యాంకింగ్ రంగంలో రాష్ట్రాల నుంచి మరింత లోతైన ఆలోచన రావాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త రంగాల్లో తాము చేస్తున్న ప్రయత్నాలపైనా చర్చ జరుగుతోందన్నారు. సహకార ట్యాక్సీలు, బీమా రంగంలో రాష్ట్రాల భాగస్వామ్యంపైనా చర్చిస్తామన్నారు. రాష్ట్రాలలో సహకార విద్యావ్యవస్థను ఎలా అనుసంధానించాలో, పాఠశాలలు ఎలా స్థాపించాలనే దానిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు వివరించారు. ఈ సదస్సులో మూడు నెలల కార్యాచరణపై ముఖ్యమైన అంశాలు ఉంటాయన్నారు.



ఇతర రంగాల్లోకి విస్తరిస్తాం

సహకార సంస్థలు కేవలం రైతుల రుణావసరాలను తీర్చడమే కాకుండా ఆరోగ్యసేవలు(జన ఔషధి కేంద్రాలు), ఆహార ప్రాసెసింగ్, డ్రోన్ ఆధారిత ఎరువుల పంపిణీతో పాటు ఇతర రంగాల్లోకి విస్తరిస్తాయని రాష్ట్ర సహకార కమిషనర్ ఎం.బాబు తెలిపారు. ఇలాంటి సదస్సులు సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. సహకార సంఘం బలోపేతం, ఆర్థికవృద్ధిపై కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శులు పంకజ్‌కుమార్‌బన్సాల్, రవీంద్రకుమార్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు ఆనందకుమార ఝా, రమణకుమార్ ప్రసంగించారు. వివిధ సహకారశాఖలు స్టాళ్లను ప్రదర్శించాయి. ఈ ఎగ్జిబిషన్‌లో సామాన్యులకు అందజేస్తున్న హార్డ్‌వేర్ కిట్, ఈఆర్పీ సాఫ్ట్‌వేర్ ప్రత్యక్ష డెమోను నిర్వహిస్తున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, అడిషనల్ రిజిస్ట్రార్లు ఆనందబాబు, గౌరీశంకర్, జాయింట్ రిజిస్ట్రార్లు శ్రీలక్ష్మి, చిత్తూరు, తిరుపతి డీసీవోలు లక్ష్మి, నాగవర్ధన, వివిధ రాష్ట్రాల సహకార సంఘాల కార్యదర్శులు, రిజిస్ట్రార్లు, నాబార్డు, ఎంపీడీసీ, సహకార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ భవితను తీర్చిదిద్దడంలో ప్రభుత్వ వ్యవస్థ కీలకం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ వెల్లడి

ఏర్పేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభుత్వ వ్యవస్థ ఎంతో అవసరమని లోక్ సత్తా వ్యవస్థాపకుడు, ప్రజా విధాన నిపుణుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ సూచించారు. ఏర్పేడు వద్దనున్న తిరుపతి ఐఐటీలో 'ఇండియా: ది రోడ్ అహెడ్' అంశంపై బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సమర్థ పాలన ప్రాధాన్యాన్ని వివరించారు. శాంతి, చట్టపరమైన వ్యవస్థ, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి మౌలిక వసతులు, సామూహిక అవసరాల గురించి విశదీకరించారు. భారత ప్రజాస్వామ్య ఆర్థిక అభివృద్ధిపై సంస్కరణలు చూపిన ప్రభావాన్ని వివరించారు. సమగ్ర సుస్థిర వృద్ధి ద్వారానే సమాజంలోని అసమానతలు తొలగించవచ్చని చెప్పారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీ సాధించిన ప్రగతి, చేపట్టిన చర్యలు, ఇప్పటి వరకు ఐఐటీ అందుకున్న అవార్డుల గురించి తెలిపారు. లెక్చర్ సిరీస్ అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, ఐఐటీ సిబ్బంది డాక్టర్ జయప్రకాష్ నారాయణతో 'పాలన ప్రజా విధానాల సవాళ్లు, యువత పాత్ర' వంటి అంశాలపై ముఖాముఖిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో జయప్రకాష్ నారాయణ

బ్లైండ్ స్కేటర్‌కు ఆర్థికసాయం



హర్షవర్ధన్‌కు ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి (క్రీడలు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన బ్లైండ్ స్కేటర్ హర్షవర్ధన్‌కు రూ.25 వేల సాయం అందింది. కళ్లు కనిపించకున్నా ఆ చిన్నారి స్కేటింగ్‌లో రాణిస్తున్న విషయమై సోమవారం ఆంధ్రజ్యోతిలో 'చూపులేకున్నా తగ్గేదే లే' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధులు బుధవారం హర్షవర్ధన్ ఇంటికెళ్లి తల్లి రాజకుమారి, అన్న మునిచరణ్, కోచ్ ప్రతాప్ సమక్షంలో రూ.25వేల నగదు అందించారు. కోచ్ ప్రతాప్‌ను సన్మానించారు. ప్రపంచ రికార్డును కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవాసంస్థ ప్రతినిధులు ఎం.చంద్రబాబు, ఎ.అశోక్‌కుమార్, వి.రత్నబాబు, ఎ.భాస్కరరావు, ఎం.శ్రీనివాసులు, వి.సాయినాథ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

- 13న ఛలో విజయవాడ
- డిస్కం కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): 'సదరన్ డిస్కంలో పెండింగ్ సమస్యలు, కాంట్రాక్టు కార్మికులు,గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయాలని జేఏసీ అధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేస్తున్నాం. అయినా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించలేదు. కమిటీలతో కాలయాపన తప్ప ఫలితం ఉండదు. 13న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే 15వ తేది నుంచి నిరవధిక సమ్మె తప్పదు' అని పవర్ జేఏసీ నాయకులు హెచ్చరించారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట బుధవారం జేఏసీ అధ్వర్యంలో మహా ధర్నా జరిగింది. జేఏసీ నాయకులు వి.దేవేంద్ర రెడ్డి, ఆర్.మురళీధర్, నాగరాజు, ఎల్.చలపతి, నాగార్జున, కృష్ణయ్య, బాలశౌరి, జయరామ్ మాట్లాడుతూ 26 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగులకు 4 డీఏలు చెల్లించలేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌ను రద్దు చేసి జీపీఎఫ్‌ను అమలు చేయాలన్నారు. గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేసి, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. యాజమాన్యం జేఏసీ నేతలతో చర్చించకుండా, బలంలేని టీఎన్‌టీయూసీ నాయకులను ఆహ్వానించడం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికులతో రెగ్యులర్ విధులు చేయిస్తూ స్టైఫండ్ ఎన్నేళ్లు ఇస్తారని ప్రశ్నించారు. ఈ ధర్నాలో నాయకులు రామలింగారెడ్డి, సంజీవరావు, తిరుపాలు, జయమణి, సతీష్, పృథ్వీరాజ్, అంజనేయులు, వి.గోపి, జి.ఏలుమలై, సుధాకర్, శంకర్, రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. ఈ ఆందోళనలో ఉమ్మడి ఏడు జిల్లాల నుంచి విద్యుత్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సంఘం నాయకులు

పశువైద్య రంగంలో 'బేసిక్ సైన్స్' పరిశోధనలు అవసరం

వెటర్నరీ వర్సిటీ జాతీయ సదస్సులో డాక్టర్ తిలగర్

తిరుపతిరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పశువైద్య రంగంలో బేసిక్ సైన్స్‌తో సంబంధమైన పరిశోధనల రూపకల్పన ఎంతో అవసరమని తమిళనాడు పశువైద్యవర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.తిలగర్ పేర్కొన్నారు. ఎస్వీవెటర్నరీ కళాశాలలో పశువైద్య చికిత్స, బోధన సముదాయ(వీసీసీ)విభాగ ఆధ్వర్యంలో 'నేషనల్ క్లినికల్ కేస్ కాన్ఫరెన్స్ ఫర్ వెటర్నరీ స్టూడెంట్స్' అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నైపుణ్యాలతోపాటు పశుచికిత్స, శస్త్రచికిత్సలకు సంబంధించిన ఆధునిక పశువిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. పశువ్యాధులు, వైద్యంలో స్పెషలైజేషన్లు చాలా అవసరమని, ఈదిశగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. శస్త్రచికిత్స, డయాగ్నోసిస్, వ్యాధినిర్ధారణ విభాగాల ప్రాముఖ్యతని ఇండియన్ సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కెనైన్ ప్రాక్టీస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రతాబన్ విశదీకరించారు. పశువైద్య రంగంలో కృత్రిమమేధ ఎంతో కీలకంగా మారిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ పేర్కొన్నారు. వీసీసీ ఆధ్వర్యంలో ఆధునిక పద్ధతుల్లో పశువైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఆప్తమాలజీ సేవలను పశువైద్యచికిత్స, బోధనావిభాగంలో ఆధునిక పద్ధతుల్లో సమకూర్చాలని డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య వీసీని కోరారు. ఆయా అంశాలపై విద్యార్థులు అధ్యయనం చేయాలని అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్య సూచించారు. పశువ్యాధులను ప్రారంభదశలో నిర్ధారించడం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ డాక్టర్ వి.వైకుంఠరావు అన్నారు. ఈ సదస్సుకు 14 రాష్ట్రాల నుంచి 25 వెటర్నరీ కళాశాలలకు చెందిన 250మంది విద్యార్థులు హాజరయ్యారు. పలువురు విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్ చేశారు. ప్రొఫెసర్లు ఎం.రఘునాథ్, ఎన్.ధనలక్ష్మి, ఎస్.భారతి, డాక్టర్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ సదస్సు బుక్‌లెట్‌ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ తిలగర్, డాక్టర్ జేవీరమణ, ప్రతాబన్ తదితరులు

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.18 కోట్లు



శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.2,18,65,233 సమకూరినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. బుధవారం ఆలయం ఆవరణలోని కొట్టు మండపంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల నుంచి 134 గ్రాముల బంగారం, 698.500 కిలోల వెండి, 151 విదేశీ కరెన్సీ 151 వచ్చింది. ఆగస్టు 30వ తేదీ నుంచి వచ్చిన కానుకలు లెక్కించగా ఈ ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతులది పళ్లిపట్టు సమీపం

పుత్తూరు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు జాతీయ రహదారిలో బుధవారం మధ్యాహ్నం 3.20 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా.. వెనకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ఘటనలో అక్కడికక్కడే వీరిద్దరూ మృతిచెందారు. మృతులు.. తిరవళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా పొతట్టూరుపట్టి గ్రామానికి చెందిన బి.వి.సుబ్రమణ్యం(53), మూర్తి గురునాథం (60)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతుల కుటుంబాలకు సమాచారం ఇచ్చిన ఎస్‌ఐ ఓబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బి.వి.సుబ్రమణ్యం, మూర్తి గురునాథం

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలి



విద్యార్థులతో డీఎఫ్‌వో హారిక, అటవీశాఖ సిబ్బంది

సూళ్లూరుపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణంతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు అందరూ సహకరించాలని డీఎఫ్‌వో హారిక అన్నారు. బుధవారం మండల పరిధిలోని అట్టకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. 5 పాఠశాలల నుంచి 60 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, వారికి వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి రమణయ్య, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ పాలకమండలి నియామకం

చిల్లకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయానికి పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిల్లకూరు దశరథ రామిరెడ్డి, ఆనిమెళ్ల సుబ్రహ్మణ్యం, వినుకొండ సుబ్రహ్మణ్యం, తూపిలి పద్మమ్మ, దువ్వూరు అనిత, అన్నం మునిశేఖర్‌గౌడ్, మేకల కమల, ఒబ్బాయి ఉమామహేశ్వరి, పొక్కలి శ్రీలక్ష్మి, సారంగం రమేష్‌లను పాలక మండలి సభ్యులుగా నియమించారు. ఛైర్మన్‌గా చిల్లకూరు దశరథరామిరెడ్డి నియమిలయ్యే అవకాశం ఉంది.

ఎన్‌బీకేఆర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై సదస్సు

కోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నీడీ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై బుధవారం మెకానికల్ విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి సదస్సును ప్రారంభించారు. నాయుడుపేట మండలం మేనకూరులోని మూవటెక్ టైటానియం ప్రాసెస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొని విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేందుకు కావాల్సిన అంశాలను వివరించారు. కొత్త ఆలోచనలు, వాటిని అమలు చేసే విధి విధానాలపై సూచనలను ఇచ్చారు. డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనుకూలమైన అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీహరిరెడ్డి, మెకానికల్ విభాగ కోఆర్డినేటర్ మనోహర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంగా ఉంటారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని లింగవరం గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన లింగవరం జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల సాధన వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, సతీష్‌యాదవ్, గుండాల లీలావతి, అన్నం మునిశేఖర్‌గౌడ్, మూగ శంకరయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

జన్ని రమణయ్యకు ఎమ్మెల్యే కురుగొండ్ల పరామర్శ


రమణయ్యతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు

డక్కిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు జన్ని రమణయ్యను బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. జన్ని రమణయ్య తల్లి పిచ్చమ్మ అంత్యక్రియలు బుధవారం నెల్లూరులో జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన రామకృష్ణ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వెంకటగిరి ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, డక్కిలి, వెంకటగిరి, బాలాయపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పప్పు చంద్రమౌళి రెడ్డి, అవ్వారు సత్యనారాయణ, రావి సత్యం, లింగసముద్రం, మోపూరు సింగిల్ విండోల అధ్యక్షులు రాజా, జనార్దనరెడ్డి తదితరులు పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదు: నేదురుమల్లి


మీడియాతో మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు నిర్వహించే ధైర్యం సీఎం చంద్రబాబుకు లేదని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ మూడన్నరేళ్లుగా ఖాళీగా ఉన్న వెంకటగిరి జడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించకుండా ఒంటిమిట్ట, పులివెందుల స్థానాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించడం స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు వైఖరికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిందని, ఏడు త్రై మాసికాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల ఊసేలేదన్నారు. మహిళలకు ప్రతి నెలా రూ.1500, నిరుద్యోగ భృతి రూ.3వేలు, హామీలు అమలు చేయలేదన్నారు. ఇక వెంకటగిరిలో నామినేటెడ్ పదవులు అమ్ముకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, నక్కా వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు రాధ, శంకరయ్య, బాలయ్య, రాజారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టపాకాయల విక్రయంపై విచారణ చేపట్టాలి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ ముసుగులో టపాకాయల విక్రయంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని తిరుపతికి చెందిన శ్రీవారి భక్తుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో రెండు టపాకాయల దుకాణాలను ఐదుగురు ఉద్యోగులు కలిసి నిర్వహిస్తున్నారని, అయితే ఉద్యోగులకు ఏ మాత్రమూ తక్కువ రేట్లకు ఇవ్వడం లేదని ఆరోపించారు. కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో టీటీడీ ముసుగులో జరుగుతున్న ఈ దోపిడీని అడ్డుకోవాలని కోరారు. జీఎస్టీ ఎవరి పేరుతో ఉంది.. ఏ ఖాతాకు డబ్బు జమ అవుతోందన్న విషయాలు తేలాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో నాగులు, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు పంచాయతీల విభజనకు గ్రామసభలు

బాలాయపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు, వెంగమాంబపురం పంచాయతీల విభజనకు గురువారం ఉదయం 11 గంటలకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆ పంచాయతీల కార్యదర్శులు మోహన్‌రాజు, దయాకర్ తెలిపారు. నిడిగల్లు పంచాయతీ నుంచి గాజులపల్లి, వెంగమాంబపురం పంచాయతీ నుంచి అక్కసముద్రం గ్రామాన్ని విభజించే విషయమై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

షార్‌లో విద్యార్థుల సందడి

సూళ్లూరుపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్‌ను సందర్శించే అవకాశం కల్పించారు. బుధవారం జిల్లా నలు మూలల నుంచి విద్యార్థులు షార్‌కు విచ్చేశారు. ప్రయోగ వేదికలతో పాటు, మిషన్ కంట్రోల్ సెంటర్, శ్రీహరికోటలో ఉన్న స్పేస్ మ్యూజియాన్ని విద్యార్థులు తిలకించారు. షార్ నుంచి ప్రయోగించిన రాకెట్లు, అంతరిక్షంలోకి పంపిన ఉపగ్రహాల గురించి షార్ ఉద్యోగులు విద్యార్థులకు వివరించారు.

హెచ్‌ఐవీపై అవగాహన

నాయుడుపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు అన్నారు. బుధవారం నాయుడుపేట, తుమ్మూరు, తిమ్మాజికండ్రిగ, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో సమగ్ర ఆరోగ్య ప్రచార రథం ద్వారా హెచ్‌ఐవీ నివారణపై డాక్యుమెంటరీ ప్రదర్శించారు.



తెలుగుగంగ కాలువ నుంచి పైప్‌లైన్‌తో సాగునీరు తోడుకునే ప్రయత్నంలో రైతులు - చుక్కనీరు లేని ఆరిమేనిపాడు చెరువు

చెంతనే 'గంగ'... రైతులకు తీరని బెంగ

- ఎండిపోయిన ఆరిమేనిపాడు చెరువు
- సాగునీటికి కటకటలాడుతున్న రైతులు

ఓజిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చెరువు నుంచి పట్టుమని పర్లాంగు దూరం కూడా లేని తెలుగుగంగ 5వ బ్రాంచి కాలువ... ఎన్నో ఏళ్లుగా రైతులు గంగ నీటి ప్రవాహాన్ని చూస్తూనే ఉన్నారు... ఆ నీరు ఎప్పుడు తమ చెరువుకు చేరుతుందో అంటూ మరోపక్క ఆవేదన... కేవలం వర్షాధారం మీదనే ఆధారపడిన రైతులకు ఆయకట్టు సాగు ప్రశ్నార్థకమవుతోంది. ఓజిలి మండలం ఆరిమేనిపాడు చెరువు కింద 215 ఎకరాల ఆయకట్టు ఉంది. గ్రామంలోని 125 మందికి పైగా రైతులకు ఈ ఆయకట్టు కింద భూములున్నాయి. అందరూ సన్న, చిన్నకారు రైతులే. ఆరిమేనిపాడు చెరువుకు దిగువన దక్షిణం వైపునుంచి తెలుగు గంగ 5వ బ్రాంచి కాలువ వెళుతోంది. అయితే ఈ చెరువుకు మాత్రం సాగునీరు అందే పరిస్థితి లేదు.

లిఫ్టు ద్వారా మాత్రమే సాధ్యం

గంగ కాలువ కంటే 30 అడుగులకు పైగా ఎత్తులో ఆరిమేనిపాడు చెరువు ఉంది. కేవలం గంగ కాలువ నుంచి లిఫ్టు ద్వారా మాత్రమే చెరువును నింపడం సాధ్యమవుతుంది. రైతులు గతంలో ప్రజాప్రతినిధులకు నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు కూడా ఇచ్చి సమస్యను వివరించారు. అయినా ఎవరూ పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా సాగునీటి తిప్పలు తప్పడంలేదని, కొన్ని పర్యాయాలు సరైన వర్షాలు పడక భూములను బీడుగా వదిలిపెడుతున్నామని వాపోతున్నారు. సమీపంలోనే తెలుగు గంగ ప్రవహిస్తున్నా.. ఆ నీటిని తమ చెరువుకు మళ్లించేందుకు అవకాశం లేకపోవడం దరదృష్టకరమని, ఆరిమేనిపాడు చెరువు ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని సాగునీటి సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల అశోక్‌రాజు కోరతున్నారు.

రైల్వే స్టేషన్లను పరిశీలించిన డీఆర్‌ఎం


సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం శైలేంద్ర సింగ్

సూళ్లూరుపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌ను చెన్నై డీఆర్‌ఎం శైలేంద్ర సింగ్ బుధవారం పరిశీలించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన అధికారులతో కలిసి ప్రజలను నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూళ్లూరుపేట కచ్చేరివీధిలో ఉన్న రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి లేనందున అవస్థలు పడుతున్నామని, సత్వరమే నిర్మాణానికి చ్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల సమస్య ఉందని, స్థానికులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారం కూడా అవసరమన్నారు. అమృత్ భారత్ పథకం కింద సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేశామని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆయన టికెట్ బుకింగ్ సెంటర్, ప్రయాణికుల విశ్రాంత భవాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొటక్షన్ మేనేజర్ చలం, హరికృష్ణ, భరత్, మురళి పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: స్థానిక రైల్వేస్టేషన్‌ను డీఆర్‌ఎం శైలేంద్రసింగ్ తనిఖీ చేశారు. బుధవారం చెన్నై నుంచి ప్రత్యేక రైలులో నాయుడుపేటకు చేరుకున్న ఆయనకు స్టేషన్ మాస్టర్ చిరంజీవి, ఉద్యోగులు స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ సమీపంలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో మూసివేసిన 78వ నెంబరు రైల్వే గేట్‌ను పునరుద్ధరించాలని ఆ కాలనీవాసులు గత వారంలో చెన్నై వెళ్లి డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. దీంతో బుధవారం ఆయన నాయుడుపేటకు వచ్చారు. రైల్వేస్టేషన్‌తో పాటు రైల్వే గేట్‌ను డీఆర్‌ఎం పరిశీలించారు. కాగా, పట్టణవాసులు, సీజనల్ వ్యాపారస్తులు, విద్యార్థులు రైల్వేస్టేషన్‌కు చేరుకొని పలు సమస్యలపై డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు.

ప్రకృతితోనే మానవ మనుగడ


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎఫ్ఆర్‌వో సౌజన్య

దొరవారిసత్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతితో మానవ మనుగడ ముడిపడి ఉందని నేలపట్టు పక్షుల కేంద్రం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్‌వో) సౌజన్య అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా నేలపట్టు పక్షుల కేంద్రంలో ఏకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేచర్ క్యాంప్ నిర్వహించారు. ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ.. మనవాళికి ప్రకృతి విద్యార్థులు అనేక రకాలుగా ఉపయోగపడుతోందన్నారు. నేలపట్టులోని పక్షులు, చెట్ల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహమతులు అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత


వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేస్తున్న విద్యార్థులు

గూడూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెంలోని సాయిరాం వృద్ధాశ్రమానికి బుధవారం గాయత్రి పాఠశాల విద్యార్థులు నిత్యావసరాలను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళ్యాణి, సుప్రజ, రేవతి, రజిని తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి స్కూల్‌గేమ్స్


గెలుపొందిన కబడ్డీ జట్టు

గూడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం డివిజన్‌స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-17 బాలుర కబడ్డీ పోటీల్లో చిట్టమూరు జట్టు విజేతగా నిలవగా, గూడూరు జట్టు రన్నర్‌గా నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో కరిముల్లా, సుబ్రహ్మణ్యం, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

వెంకటగిరి, అక్టోబర్ 8(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ వెంకటగిరి బార్ అసోసియేషన్ న్యాయ వాదులు బుధవారం విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామ్‌ప్రసాద్, ఎంవీఎస్ గిరిజా కుమారి, సుజాత, వాసు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 11:30 నుంచి గంటపాటు వర్షం పడింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. గత వారం రోజులుగా ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలు వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో సేదతీరారు.

డక్కిలి: మండల కేంద్రమైన డక్కిలిలో బుధవారం రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ఉదయం నుంచి ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నా మధ్యాహ్నం తరువాత చల్లబడింది.

కోట, బాలాయపల్లెలో కుండపోత

కోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట, బాలాయపల్లి మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. కోటలో బుధవారం మధ్యాహ్నం 3.10 నుంచి భారీ ఉరుములతో 45 నిమిషాల పాటు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం పడింది. కోట, విద్యానగర్‌లోని రోడ్లలో వర్షపునీరు నిల్వచేరింది. అలాగే బాలాయపల్లి మండలంలోనూ కుండపోత వర్షం కురిసింది. ముఖ్యంగా బాలాయపల్లి, వెంగమాంబ పురం, కడగుంట గ్రామాల్లో భారీ వర్షం పడింది. ఎండల తీవ్రతకు ఎండుముఖం పడుతున్న నిమ్మ చెట్లు వర్షంతో ఊపిరి పీల్చుకున్నా యని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగన్‌ను కలిసిన శ్రీమంత్‌రెడ్డి


జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీమంత్ రెడ్డి, ఆయన తల్లి సౌదామి

సూళ్లూరుపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల శ్రీమంత్ రెడ్డి వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన జగన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

వడమాలపేటలో హైవోల్టేజీ విద్యుత్ సరఫరా

- ప్రభుత్వ కార్యాలయాల్లో స్తంభించిన సేవలు
- ఇళ్లల్లో కాలిపోయిన టీవీలు

వడమాలపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వడమాలపేట పట్టణంలోని సబ్ సేషన్ సమీపంలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మంగళవారం మధ్యాహ్నం ఉన్నట్లుండి హై వోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో ఎంపీడీవో, రెవెన్యూ కార్యాలయాల్లో కంప్యూటర్లు ధ్వంసమయ్యాయి. స్థానికంగా ఉన్న పలు దుకాణాలు, ఇళ్లల్లో టీవీలు, మీటర్లు కాలిపోయాయి. దీంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై బుధవారం ట్రాన్స్‌కో డీఈ, ఏడీఈలు సబ్‌సేషన్‌లో విచారణ చేపట్టినా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. అధికారులు పూర్తి విచారణ చేపట్టి బాధిలపై చర్యలు తీసుకోవాలని.. తమకు జరిగిన నష్టంపై స్పందించాలని బాధితులు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 11 మందికి జరిమానా విధిస్తూ బుధవారం తిరుపతిలోని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ. 10 వేలు వంతున మొత్తం రూ.1.10 లక్షలు జరిమానా విధించారు.

పుత్తూరు వార్తలు

24 గంటల్లోనే సీఎం సహాయనిధి మంజూరు

- ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధితులు


సీఎం సహాయనిధికి సిఫార్సు లేఖను అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత అత్యవసర వైద్యం కోసం నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే భాను ప్రకాష్ సిఫార్సు మేరకు 24 గంటల్లో సీఎం సహాయనిధి నుంచి రూ.4.50 లక్షలు మంజూరైంది. తన నియోజకవర్గంలోని గేటు పుత్తూరుకు చెందిన ఎస్.ఇస్మాయిల్ గుండె సంబంధిత సమస్యతో హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వాహన డ్రైవర్‌గా పనిచేయగా వచ్చే జీతమే కుటుంబానికి ఆధారం. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తెకు వివాహం చేయగా.. కుమారుడు డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో వైద్య ఖర్చులకే కాదు, కనీస అవసరాలకూ నగదు లేకపోవడంతో ఎమ్మెల్యే భాను ప్రకాష్‌ను కలిసి సమస్యను విన్నవించారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇచ్చి పంపారు. బుధవారం సాయంత్రానికి ఇస్మాయిల్ వైద్య ఖర్చులకు రూ.4.50 లక్షలు మంజూరు చేస్తూ సదరు ఆస్పత్రికి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇస్మాయిల్‌కు సీఆర్‌టీడీ డివైజ్ ఏర్పాటు చేసేందుకు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుండగా.. మిగిలిన డబ్బు సమకూర్చుకోలేని దుస్థితిలో ఉన్నామని ఆయన కుమార్తె వాపోయారు.

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీటీవో చెన్నారెడ్డి

పుత్తూరు అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ విధానాలపై వ్యాపార రంగంలోకి అడుగుపెట్టే విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలని డీసీటీవో చెన్నారెడ్డి కోరారు. బుధవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన జీఎస్టీలో జరిగిన కొత్తమార్పులు, చెల్లింపులు, రిటర్న్స్ ఫైలింగ్, డిజిటల్ ఇన్‌వాయిస్‌లపై వివరించారు. విద్యార్థులకు జీఎస్టీపై పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకులు సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి అభినందనలు


వైద్యసిబ్బందిని అభినందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకున్న పుత్తూరు వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రి వైద్య బృందాన్ని ఆస్పత్రి సలహా సంఘ ఛైర్మన్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అభినందించారు. వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది బుధవారం ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆస్పత్రిలోని సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న గైనకాలజిస్టు పోస్టును జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి డాక్టర్ జరీనాను నగరి నుంచి బదిలీ చేశామని... అలాగే ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ సన్యశ్రీ, సిబ్బంది అన్నాదొరై, ప్రకాష్‌రావు, లత, శోభ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా



వరదయ్యపాళెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మండలంలోని యానాది వెట్టులో బుధవారం జరిగింది. కంకర లోడ్డుతో సత్యవేడు వైపు వెళుతున్న టిప్పర్ యానాదివెట్టు వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డుపై వేగంగా వెళుతూ అదుపుతప్పి ఇంటి ప్రహారీపై పడింది. దీంతో ఇంటి ప్రహారీ కూలిపోయింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న దర్ఫ్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ సుధాకర్

శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దర్ఫ్ బ్యాడ్మింటన్ అకాడమీలో డివిజనల్‌స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు బుధవారం శ్రీకాళహస్తిలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్ఫ్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచి క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ డివిజనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో గెలుపొందిన వారు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్లు హేమకుమార్, లోకనాథం, సురేష్, దర్ఫ్ బ్యాడ్మింటన్ అకాడమీ కోచ్ పవన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చోడవరం గ్రామానికి చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జి తాతయ్య తల్లి సుశీలమ్మ బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాంబాబునాయుడు, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన అవసరం



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో-2 మునిసుబ్రహ్మణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన అవసరమని.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జీఎస్టీతో పన్నులు భారం నుంచి ఉపశమనం కలిగిందని ఎంఈవో-2 మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని నెలవాయి ఉన్నత పాఠశాల విద్యార్థులకు తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరిప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా వేంపల్లికి చెందిన దేవదుర్గం నాగభూషణం బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఈవో బాపిరెడ్డికి విరాళం అందజేస్తున్న దాత

ఎమ్మెల్యేకు ఆటో డ్రైవర్ల సన్మానం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న రేణిగుంట ఆటో డ్రైవర్లు

రేణిగుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని రేణిగుంట ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవా పథకంతో లబ్ధిపొందడంతో టీడీపీ మండలాధ్యక్షుడు మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ఊరందూరులోని స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై నీటి మళ్లింపునకు చర్యలు



ప్రధాన రహదారిపై ఎక్స్‌కవేటర్‌తో నీటిని తొలగిస్తున్న టీడీపీ నాయకులు

కేవీబీపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారి శ్రీకాళహస్తి- పిచ్చాటూరు మార్గంలో సంతమైదానం వద్ద నీరు చెరువులా చేరిందని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుధవా రం నీటి మళ్లింపునకు జేసీబీ సాయంతో సైడు కాలువలు తీశారు. పొలాలు మునిగిపోతాయని, గతంలో ఆర్‌అండ్‌బీ ఏర్పాటు చేసిన తూమును తెరవాలని స్థానిక రైతులు ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించారు. త్వరలో పనులు పూర్తి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

కాటూరు సహకార సంఘ చైర్మన్‌గా భాస్కర్‌యాదవ్

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు సహకార సంఘ చైర్మన్‌గా వేంపల్లి భాస్కర్‌యాదవ్ నియమితులయ్యారు. గాజులపెళ్లూరు గ్రామానికి చెందిన భాస్కర్‌యాదవ్ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతి కోసం పని చేశారు. ఆయన సేవలను గుర్తించి పదవిని కేటాయించారు. తనపై నమ్మకంతో అవకాశాన్ని కల్పించిన సత్యవేడు టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభివృద్ధికి నిరంతరం పని చేస్తానని పేర్కొన్నారు.



శ్మశాన దారికి స్థలం కేటాయింపు



శ్మశాన భూమిని పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఎస్‌పురం గ్రామంలోని శ్మశాన దారి కోసం బుధవారం తహసీల్దారు శ్రీదేవి స్థలాన్ని కేటాయించారు. శ్మశానానికి కొంతవరకు దారిసమస్య ఉండటంతో గ్రామస్థులు ప్రజా సమస్యల వేదికలో ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దారు సిబ్బందితో వెళ్లి శ్మశానానికి దారి సౌకర్యం కల్పించారు. గ్రామస్థులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువులు పొందేందుకు కార్డు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో షణ్ముగం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం ఇకపై రైతులు పంపిణీ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని ఏవో షణ్ముగం తెలిపారు. బుధవారం మండలంలోని కాటూరు గ్రామంలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఒరిజనల్ ఆధార్ కార్డు తీసుకెళ్లి రైతు సేవా కేంద్రాల్లో అందిస్తే కార్డులు అందిస్తారన్నారు. సబ్సిడీ ఎరువులు పొందాలంటే ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాలకు కార్డు తీసుకెళ్లాల్సి ఉంటుందని సూచించారు. వరి సాగులో ఎరువులను అధిక మోతాదులో వాడటం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో ఏఈవో రేవతి, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభిస్తున్న అధికారులు

ఏర్పేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండల కేంద్రంలో బుధవారం బ్యాంకు అధికారులతో కలిసి తహసీల్దారు భార్గవి మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. 30 రోజులపాటు శిక్షణ అందించిన అనంతరం సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, గుణయాదవ్, కృష్ణవేణి, సుబ్రహ్మణ్యం, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దండి రాఘవయ్యకు సన్మానం



దండి రాఘవయ్యను సత్కరిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడిగా ఎన్నికైన దండి రాఘవయ్యను బుధవారం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు శ్రీనివాసులు తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి సేవ చేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. భక్తులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సురేష్, శ్రీనివాసులు, చాంద్‌బాషా, అశోక్‌కుమార్, తేజు, అంజూరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మ్యాక్స్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ అధినేత బీవీవీఎస్ఎన్ రాజు సీఎస్ఆర్ ద్వారా రూ.10 లక్షలు విలువ చేసే అధునాతన వైద్యపరికరాలను వితరణ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ఆస్పత్రి అధికారులకు అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే ఆస్పత్రి వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఇటీవల ఆస్పత్రిలో చేపట్టిన అభివృద్ధి, వసతుల కల్పనపై రోగులతో మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి చేయడంపై తాను ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నానని.. తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నెలకొల్పిన ప్రభుత్వాస్పత్రిలో 26 ఏళ్లగా తన కుటుంబం ఎప్పటికప్పుడు అధునాతన సేవలను కల్పించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వాస్పత్రిలో ఆర్వోప్లాంటు, టేబుళ్లు, ఐసీయూ బెడ్లు, బెడ్స్ అండ్ లాకర్లు, మధ్యాహ్నం ఉచిత భోజన వసతితో పాటు కుర్చీలు, కర్టెన్లు, దోమల నియంత్రణకు నెట్‌లు వంటి ఎన్నో అవసరాలను సమకూర్చామన్నారు. తాజాగా తన స్నేహితుడు రాజు అడిగిన వెంటనే ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఇతర విభాగాలకు అవసరమైన రూ.10 లక్షలు విలువైన పరికరాలను అందజేయడం సంతోషకరమన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీతో దశల వారీగా ఎప్పటికప్పుడు చర్చించి మరింత అభివృద్ధి కార్యాచరణ సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి, ఆస్పత్రి వైద్యాధికారి మణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రత్నకుమారి, టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, సుమతి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రమేష్‌బాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రికి పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలి

• ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు అలసత్వం వీడి అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిమూలం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులకు తాను నిధులు మంజూరు చేయించుకొస్తే క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంతో పనులు సకాలంలో చేపట్టకుండా పనులను మరుగున పెట్టడం సరికాదన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరితో నిధులు వెనక్కి మళ్లే ప్రమాదం ఉందన్నారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని సూచించారు. మండలంలో నూతనంగా మంజూరైన ఏడు పంచాయతీ భవనాల నిర్మాణాలకు సంబంధించి స్థల సేకరణ చేపట్టి పనులు ప్రారంభించాలని సూచించారు. సత్యవేడులో డ్రైనేజీ నిర్మాణాల కోసం మంజూరైన రూ.30 లక్షల తుడా నిధులతో పనులు చేపట్టకుండా కాలయాపన చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కోసం మంజూరైన నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. పేదల ఇంటి పట్టాల కోసం సేకరించిన 13 ఎకరాల భూమిని ఇంతవరకు పంపిణీ చేయక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఏవో గౌరి మాట్లాడుతూ రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందన్నారు. సిబ్బంది కొరతతో రైతులకు సకాలంలో యూరియా కార్డుల పంపిణీ, ఈ క్రాప్ నమోదు సాగడం లేదని తెలిపారు. అదనపు సిబ్బందిని కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. సమావేశంలో తహసీల్దార్ సుధీర్, ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలకు మేలు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కోలా ఆనంద్ తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో కూటమి నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. దుకాణాల యజమానులు, కొనుగోలుదారుల వద్దకు వెళ్లి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరుతో ముద్రించిన కరపత్రాలను పంచుతూ జీఎస్టీ సరళీకరణ లాభాలను వివరించారు. జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 99 రకాల వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లు తగ్గించిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, సుబ్బయ్య, కాసరం రమేష్, ఢిల్లీబాబు, జనసేన నేతలు కొట్టేసాయి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'నకిలీ మద్యానికి బాటలు వేసింది వైసీపీనే'

శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యానికి బాటలు వేసిందే గత వైసీపీ ప్రభుత్వం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహామండలి డైరెక్టర్ ఎం.సుబ్బయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019-24 సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో మద్యం ఏరులై పారిందన్నారు. రాష్ట్రంలో 40 వేల మద్యం బెల్టు దుకాణాలకు అనుమతి ఇచ్చి విచ్చలవిడిగా కల్తీ మద్యాన్ని అమ్మి ఎంతోమంది అమాయకుల ప్రాణాలను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలో ఎవరు తప్పు చేసినా వెంటనే శిక్ష ఉంటుందన్నారు. అందుకు ఉదాహరణే ఇటీవల తంబళ్లపల్లి నకిలీ మద్యం ఘటనలో నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డిపై సీఎం చంద్రబాబునాయుడు వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. నకిలీ మద్యం విషయంలో త్వరలోనే నిజాలు నిగ్గు తేలుతాయని తెలిపారు.



మాట్లాడుతున్న సుబ్బయ్య

రేపు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకమండలి ప్రమాణ స్వీకారం

శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీన పట్టణంలోని మహేష్ కల్యాణ్ సదన్‌లో శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు పాలక మండలి ప్రమాణ స్వీకారం జరగనుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరు కానున్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని.. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని చైర్మన్ ఖాదర్‌బాషా, సభ్యులు తెలిపారు.

రెండు ఇసుక లారీల స్వాధీనం



సత్యవేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను సత్యవేడు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రామస్వామి కథనం మేరకు.. స్థానిక ఎన్ఎంకండ్రిగ వద్ద బుధవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడు వైపు వెళుతున్న రెండు టిప్పర్లను తనిఖీ చేయగా రికార్డులు, అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. రాజంపేటకు చెందిన డ్రైవర్లు దినేష్, రహ్మతుల్లాను అదుపులో తీసుకుని టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లతోపాటు టిప్పర్ యజమానులు రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పశువులకు ఉచిత వైద్యసేవలు

రేణిగుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ కరకంబాడి శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్ మండల అసిస్టెంట్ డైరెక్టర్ సునీత, డాక్టర్ స్రవంతి దూడలకు మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా సంభవించే రోగాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పశువులను పరీక్షించి టీకాలు వేశారు. ట్రస్టు ప్రాజెక్టు అధికారి రవి, చైల్డ్ ఫండ్ ఇండియా ప్రాజెక్టు అధికారి రమేష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



